పెన్ పవర్

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు


విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 2 సంచిక : 57 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు (ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | శనివారం 31 అక్టోబర్ 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :57 PAGES :8 | EDITOR : G. A. RAO (ANAND GANTYADA) | PUBLISHED : ONGOLE | SAT 31 OCTOBER 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



యూపీలో మళ్లీ బీజేపీదే అధికారం

- యూసీసీ అమలు చేస్తాం
- 30 ఏళ్ల వరకు ఎస్పీకి అధికారం లేదు
- రామభక్తులపై కాల్పులను గుర్తుచేసిన షా
- ఓటు చోరీపై చర్చకు సిద్ధం
- యూసీసీపై దేశవ్యాప్త చర్చ



కృష్ణ-గోదావరి బేసిన్ వివాదంపై కీలక నిర్ణయం

- మధ్యవర్తిగా జస్టిస్ దేశాయ్ నియామకం
- ఇరువక్షాల అంగీకారంతో నిర్ణయం
- పరిష్కారానికి నిపుణుల సహకారం
- మధ్యవర్తిత్వానికి పూర్తి సహకారం
- నాలుగు వారాల తర్వాత సమీక్ష
- విచారణ నిలిపివేతకు గతంలో నిరాకరణ



1న పుర పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా

- 36,351 మందితో బందోబస్తు
- 12,244 కేంద్రాల్లో 1న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్
- 1.03 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు

అమరావతి

నవంబర్ 1న జరగనున్న వంద పట్టణ స్థానిక సంస్థల పోలింగ్‌కు రాష్ట్ర ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా రాష్ట్రవ్యాప్తంగా 36,351 మంది పోలీసు సిబ్బందిని మోహరిస్తోంది. పోలీసు సిబ్బందితో పాటు డ్రోన్లు, సీసీ కెమెరాలు, వీడియో గ్రాఫర్ల ద్వారా నిరంతర నిఘాకు చర్యలు తీసుకుంటున్నారు. వివిధ జిల్లాల్లో 671 పోలింగ్ కేంద్రాలను అత్యంత సున్నితమైనవిగా గుర్తించి వాటి వద్ద 3,355 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. మరో 1,233 సున్నిత కేంద్రాల కోసం మరో 4,943 మందిని సిద్ధం చేస్తున్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని వివరాలు 2లో..

తుపాను బాధితుల కష్టం తెలుసు..

ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

- సీఎం చంద్రబాబు భరోసా
- పశ్చిమగోదావరి జిల్లాలో సీఎం చంద్రబాబు రెండో రోజు పర్యటన
- తుపాను బాధితులను ఆదుకుంటామని, పంటల బీమాతో ధీమా కల్పిస్తామని హామీ
- 15 వేల విద్యుత్ స్తంభాలు కూలాయని, సరఫరా పునరుద్ధరణకు చర్యలు
- తుపాను నష్టం ప్రాథమికంగా రూ.4,600 కోట్లుగా అంచనా
- బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకుల పంపిణీ
- అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధుల విడదల



అమరావతి

'అర్నబ్' తుపాను సృష్టించిన బీభత్సం వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని, బాధితులకు పూర్తి న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు. నీట మునిగిన పంటలతో కన్నీరు పెడుతున్న రైతులు, తీవ్ర నష్టాలను ఎదుర్కొన్న కొబ్బరి రైతులు, జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయ, పునరావాస కార్యక్రమాలను వివరాలు 2లో..



ఉత్తరాఖండ్ హెలికాప్టర్ ప్రమాదం విషాదాంతం.. ఆరుగురి మృతి

- ఉత్తరాఖండ్‌లోని జోషిమఠ్ సమీపంలో కుప్పకూలిన హెలికాప్టర్
- బద్రీనాథ్ నుంచి బయల్దేరిన కాసేపటికే గాల్లో సంబంధాలు కోల్పోయిన విమానం
- మృతుల్లో పైలట్‌తో పాటు కర్ణాటకకు చెందిన ఐదుగురు యాత్రికులు
- ప్రమాదం నేపథ్యంలో ట్రాన్స్ భారత్ ఏవియేషన్ సేవలు తాత్కాలికంగా నిలిపివేత
- వరుస ప్రమాదాలపై ఆందోళన వ్యక్తం చేసిన మాజీ సీఎం హరీశ్ రావత్



నవంబర్ 20 వరకు గడువు పొడిగింపు


- 30న తుది ఓటర్ల జాబితా
- ఈసీ తాజా ఉత్తర్వులు జారీ
- వివేక్ యాదవ్ వెల్లడి
- ఆరు రాష్ట్రాల్లో సవరించిన షెడ్యూల్
- అధికారుల అభ్యర్థనతో గడువు పెంపు
- దిల్లీకి డిసెంబర్ 22 వరకు గడువు
- దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ తుది దశ

అమరావతి

ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మరోసారి పొడిగించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు మరో ఐదు రాష్ట్రాల్లో సవరించిన షెడ్యూల్‌ను ప్రకటించింది. నవంబరు 20 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను స్వీకరించనున్నారు. నవంబరు 30న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈ మేరకు సవరించిన షెడ్యూల్?పై తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో సర్ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించిందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. సర్ వివరాలు 2లో..

మత్స్యకారుల సమస్యలపై చర్చ

- పడవలకు బీమా కల్పించే యోచన
- నష్టంపై పవన్ కల్యాణ్ సమీక్ష
- ఉప్పాడ రక్షణ గోడ పనులు వేగవంతం
- కాకినాడలో విద్యుత్ అంతరాయం
- ఉప్పాడలో భారీగా తీర కోత
- బీచ్ రోడ్డు ధ్వంసం.. రాకపోకలు బంద్
- 54,435 హెక్టార్లలో పంట నష్టం
- 21 మండలాల్లో అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



అమరావతి

అర్నబ్ తుపాను నేపథ్యంలో కాకినాడ జిల్లాలో జరిగిన నష్టం, ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యలపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సమీక్ష నిర్వహించారు. అమరావతి నుంచి వర్చువల్ విధానంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప్పాడ తీర ప్రాంత ప్రజలు, మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. పిఠాపురం నియోజకవర్గం యు.కొత్తపల్లి ఎంపీడీవో కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్, ఎస్పీ బిందు మాధవ్ పాల్గొన్నారు. జిల్లాలో తుపాను వల్ల జరిగిన నష్టం, చేపట్టిన సహాయక చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు, రైతులు, మత్స్యకారులు పాల్గొన్నారు. "తీరప్రాంత మత్స్యకారుల సమస్యలకు శాశ్వత పరిష్కారాలు అన్వేషించాలి. వేట పడవలకు బీమా కల్పించే అంశంపై ప్రతిపాదనలు వివరాలు 2లో..




49.6 కోట్ల మందికి పేదరికం నుంచి విముక్తి

- 2.6 శాతానికి తీవ్ర పేదరికం.. ఉపాధితో తగ్గిన పేదరికం
- సంక్షేమ పథకాలతో ఊరట.. 2028 నాటికి మరింత తగ్గుదల
- గ్రామీణ ప్రాంతాల్లో పురోగతి.. వీడని ఆదాయ అసమానతలు

జనవరి 25 నుంచి జనగణన

- ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు మినహాయింపు
- మార్చి 1 అర్ధరాత్రి కీలక గడువు
- జనవరి 10 నుంచే స్వీయ నమోదు
- రెండు దశల్లో జనాభా లెక్కింపు
- జనగణనకు రూ.11,718 కోట్ల కేటాయింపు
- కరోనా కారణంగా ఐదేళ్లు ఆలస్యం
- చివరిసారిగా 2011లో జనాభా లెక్కింపు





ఆఖరి శ్వాస వరకు ప్రజా సేవ చేస్తూనే ఉంటా

- చివరి శ్వాస వరకు ప్రజాసేవ.. దేశం కష్టాల్లో ఉంటే సంబరాలా?
- ఎరువులు, గ్యాస్‌పై దుష్ప్రచారం.. రైతులపై ధరల భారం పడనివ్వం
- రైతు సంక్షేమమే లక్ష్యం.. పీఎం-కిసాన్‌కు రూ.4.5 లక్షల కోట్లు
- బనాస్కాంత రైతులపై ప్రశంసలు.. పశుసంవర్ధక రంగానికి ప్రోత్సాహం

పెన్ పవర్

శనివారం 31 అక్టోబర్ 2026

తుపాను బాధితుల కష్టం తెలుసు..
ప్రతి ఒక్కరినీ ఆదుకుంటాం

-మొదటిపేజీ తరువాయి

యుద్ధప్రాతిపదికన చేపట్టి, వీలైనంత త్వరగా సాధారణ పరిస్థితులు నెలకొల్పాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేసి, బాధితుల కష్టాలను స్వయంగా తెలుసుకునేందుకు చేపట్టిన పర్యటనలో భాగంగా, రెండో రోజైన శుక్రవారం ఆయన పశ్చిమగోదావరి జిల్లాలోని మొగల్తూరు, నరసాపురం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు.



పంటల బీమాతోనే రైతుకు ధీమా

నరసాపురం మండలం కొత్త నవరసపురంలో నీట మునిగిన వరి పంట పొలాలను ముఖ్యమంత్రి పరిశీలించారు. అక్కడి రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టంపై ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం నష్టాన్ని అంచనా వేసి ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి రైతు తప్పనిసరిగా పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. "ప్రకృతి వైపరీత్యాలు మన చేతుల్లో లేవు. కానీ, నష్టం జరిగినప్పుడు బీమా ఉంటే రైతుకు ఆర్థికంగా భరోసా ఉంటుంది. ఇ-పంట విధానం ద్వారా రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు బీమా సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీకి అదనంగా బీమా పరిహారం రైతుకు అండగా నిలుస్తుంది" అని వివరించారు. పంట కాలువల్లో పూడిక కారణంగా నీటి ప్రవాహం సరిగా లేక పంటలు ముంపునకు గురవుతున్నాయని రైతులు సీఎం దృష్టికి తీసుకురాగా, ఆయన తక్షణమే స్పందించారు. గోదావరి డెల్టా కాలువల ఆధునీకరణకు రూ.3 వేల కోట్లు కేటాయించామని, త్వరలోనే పనులు ప్రారంభించి ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రైతులు ప్రకృతి సేద్యం వైపు దృష్టి సారిస్తే, పంటలకు మంచి డిమాండ్ వస్తుందని, ఆదాయం కూడా పెరుగుతుందని సూచించారు.

నేలకొరిగిన 15 వేల విద్యుత్ స్తంభాలు

తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా 15 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకూలాయని, ఇది విద్యుత్ సరఫరాకు పెను సవాలుగా మారిందని సీఎం తెలిపారు. "రేపు సాయంత్రానికల్లా రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరిస్తాం. తొలుత గృహ అవసరాలకు, ఆ తర్వాత వ్యవసాయానికి విద్యుత్ అందిస్తాం" అని ప్రకటించారు. అవసరమైతే తెలంగాణ నుంచి కూడా అదనపు సిబ్బందిని రప్పించి పనులు వేగవంతం చేస్తున్నట్లు వెల్లడించారు. పునరుద్ధరణ పనులను స్వయంగా పరిశీలించిన ఆయన, కార్మికులతో కలిసి విద్యుత్ స్తంభాన్ని నిలబెట్టేందుకు సహకరించి వారిలో స్ఫూర్తి నింపారు. విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న విద్యుత్ సిబ్బందిని, కార్మికులను ముఖ్యమంత్రి అభినందించారు. ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే 12,500 చెట్లు కూలిపోయాయని, వాటిని తొలగించి రవాణా వ్యవస్థను పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. ప్రైవేట్ టెలికాం టవర్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో కమ్యూనికేషన్ వ్యవస్థకు అంతరాయం ఏర్పడిందని, వాటిని కూడా త్వరగా పునరుద్ధరిస్తామని తెలిపారు.

షెల్టర్లలో బాధితులకు భరోసా.. మత్స్యకారులకు హామీ

అనంతరం మొగల్తూరు మండలం మాట్రేవు గ్రామంలోని తుపాను పునరావాస కేంద్రాన్ని (షెల్టర్) ముఖ్యమంత్రి సందర్శించారు. గత నాలుగు రోజులుగా అక్కడే ఆశ్రయం పొందుతున్న మహిళలు, వృద్ధులు, చిన్నారులతో మాట్లాడారు. తుపాను తీరం దాటే సమయంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని గడిపామని, తీవ్ర భయాందోళనకు గురయ్యామని బాధితులు సీఎంకు వివరించారు. దీనిపై స్పందించిన చంద్రబాబు, "ప్రభుత్వం ముందుగానే హెచ్చరికలు జారీ చేసి, ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వల్లే ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగాం. మీ ప్రాణాలకు మాది భరోసా" అని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా వశిష్ట గోదావరి ముఖద్వారం వద్ద పూడిక సమస్య తీవ్రంగా ఉందని, దీనివల్ల వేటకు వెళ్లడం కష్టంగా మారిందని మత్స్యకారులు సీఎం దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన, సముద్ర ముఖద్వారం వద్ద పూడికను తొలగించి, మత్స్యకారులు సులభంగా వేట సాగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు.

రూ.4,600 కోట్ల నష్టం.. కేంద్ర బృందం పర్యటన

షెల్టర్ సందర్శన అనంతరం ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. 'అర్నబ్' తుపాను ప్రభావాన్ని ప్రత్యక్షంగా పరిశీలించానని, ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం తీసుకున్న ముందస్తు చర్యలు సత్ఫలితాలనిచ్చాయని అన్నారు.

"రాత్రంతా సమీక్షలు నిర్వహిస్తూ, ఎప్పటికప్పుడు అధికారులను అప్రమత్తం చేశాం. గతంతో పోలిస్తే ప్రాణ నష్టాన్ని భారీగా తగ్గించగలిగాం. అయినప్పటికీ, దురదృష్టవశాత్తూ ఏడుగురు మరణించడం బాధాకరం" అని విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించామని తెలిపారు. తుపాను వల్ల ప్రాథమిక అంచనాల ప్రకారం రాష్ట్రానికి రూ.4,600 కోట్ల నష్టం వాటిల్లిందని, ఈ మేరకు కేంద్రానికి నివేదిక పంపామని చెప్పారు. పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేసి మరో నివేదిక అందిస్తామని, నష్ట తీవ్రతను పరిశీలించేందుకు కేంద్ర బృందం కూడా రాష్ట్రంలో పర్యటిస్తోందని వెల్లడించారు.

బాధితులకు నిత్యావసరాలు, రైతులకు నిధులు

తుపాను కష్టకాలంలోనూ రైతులకు అండగా నిలుస్తూ, పీఎం కిసాన్--అన్నదాత సుఖీభవ పథకం రెండో విడత నిధులను శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ చేశామని సీఎం ప్రకటించారు. తుపాను బాధిత కుటుంబాలకు బియ్యంతో పాటు కందిపప్పు, వంటనూనె, బంగాళదుంపలు వంటి నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సహాయక శిబిరాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ రేషన్ అందేలా చర్యలు తీసుకున్నామని, తుపాను వల్ల నష్టపోయిన చిట్టచివరి వ్యక్తికి కూడా న్యాయం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అనంతరం బాధితులకు ఆయన స్వయంగా రేషన్ సరుకులు పంపిణీ చేశారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట మంత్రి నిమ్మల రామానాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు ఉన్నారు.

నవంబర్ 20 వరకు గడువు పొడిగింపు

-మొదటిపేజీ తరువాయి

ప్రక్రియకు జూలై ఒకటి అర్హత తేదీగా పరిగణిస్తూ, డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా జూలై 31న ప్రకటించామన్నారు. అక్టోబర్ 22 వరకు క్లెయిమ్?లు, అభ్యంతరాలను స్వీకరించి 30న తుది ఓటర్ల జాబితా ప్రచురించాలని తొలుత నిర్ణయించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం తాజా ఉత్తర్వులతో నవంబర్ 20 వరకు క్లెయిమ్‌లను, అభ్యంతరాలు తీసుకోనున్నట్టు వివరించారు. నవంబర్ 30న సర్ పూర్తయ్యాక ఓటర్ల జాబితాలను వెల్లడిస్తామని వివేక్ యాదవ్ తెలిపారు.

6 రాష్ట్రాల్లో సవరణ

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల్లో పారదర్శకత పెంచడం, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడం, అనర్హులు, డూప్లికేట్ ఓట్లను గుర్తించడం లక్ష్యంగా ఎన్నికల సంఘం ఎస్ఐఆర్ చేపట్టింది. ఇప్పటికే బిహార్, బంగాల్, తమిళనాడు, కేరళం, ఉత్తర్?ప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ ముగిసింది ప్రస్తుతం మూడో దశలో భాగంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, దిల్లీ, హరియాణా, మహారాష్ట్ర, నాగాలాండ్‌లలో ఈ ఏడాది మే 14న సర్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ దశ పూర్తయితే జమ్ముకశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, లద్దాఖ్ మినహా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ పూర్తైనట్లు అవుతుంది.

ఆయా రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారుల అభ్యర్థనల మేరకు గడువు పొడిగించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హరియాణా, మహారాష్ట్ర, నాగాలాండ్‌లలో నవంబరు 30న తుది జాబితా ప్రచురించనున్నారు. ఈ మేరకు సవరించిన షెడ్యూల్?పై కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దిల్లీలో మాత్రం డిసెంబరు 12 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణకు అవకాశం కల్పించారు. ఓటర్ల తుది జాబితాను డిసెంబరు 22న విడుదల చేయనున్నారు. ఈ దశ పూర్తయితే జమ్ముకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, లద్దాఖ్ మినహా దేశవ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తవుతుంది.

మత్స్యకారుల సమస్యలపై చర్చ

-మొదటిపేజీ తరువాయి

సిద్ధం చేయాలి. దీపావళి తర్వాత మత్స్యకార గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటన ఉంటుంది. ఉప్పాడ తీరప్రాంత రక్షణ గోడ పనులు వేగవంతం చేయాలి. మత్స్యకారుల సమస్యలపై స్వయంగా అధ్యయనం చేస్తా." కాకినాడను అతలాకుతలం చేసిన అర్నబ్ : అర్నబ్ తుపాను కాకినాడ నగరాన్ని అతలాకుతలం చేసింది. తుపాను ప్రభావంతో వీచిన భారీ ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరిగి విద్యుత్ తీగలపై పడటంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తుపాను ప్రభావం తగ్గి మూడు రోజులు గడుస్తున్నా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఇంకా పూర్తిస్థాయిలో పునరుద్ధరణ కాలేదు. మూడు రోజులుగా కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని నగరవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో అలల తాకిడికి తీరం కోతకు గురైంది. ఇటీవల ఎత్తుగా నిర్మించిన రాళ్లగట్టును సైతం అలలు దాటుకుని విరుచుకుపడ్డాయి. ఉప్పాడ సమీపంలోని కొత్తపట్నం, కొత్తపేట, పల్లిలపేట, సుబ్బంపేట, రంగంపేటతో పాటు ఉప్పాడ నుంచి కాకినాడ వెళ్లే బీచ్ రోడ్డు చాలా ప్రదేశాల్లో పూర్తిగా దెబ్బతింది. రాకపోకలు స్తంభించిపోయాయి.

54,435 హెక్టార్లలో పంటలు నష్టం

మరోవైపు అర్నబ్ తుపాన్ రైతన్నల ఆశలను గల్లంతు చేసింది. కాకినాడ జిల్లాలో కురిసిన వర్షం, బలమైన ఈదురుగాలుల కారణంగా జిల్లాలో 54,435 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యానపంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ పంటలకు సంబంధించి 4,183 హెక్టార్లలో వరి, 720 హెక్టార్లలో మినుము, అయిదు హెక్టార్లలో పత్తి, రెండు హెక్టార్లలో పెసర పంటకు నష్టం జరిగినట్లు వ్యవసాయ అధికారులు ప్రాథమిక అంచనా వేశారు. 21 మండలాల పరిధిలోని వ్యవసాయ పంట నష్టాల అంచనాపై గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కొన్నిచోట్ల పంట పూర్తిగా నీటమునగగా, మరికొన్ని ఈదురుగాలుల వల్ల పడిపోయినట్లు జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.

1న పుర పోలింగ్‌కు కట్టుదిట్టమైన భద్రతా

-మొదటిపేజీ తరువాయి



ఉల్లంఘించినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎన్నికల సంఘం హెచ్చరించింది. ఓటర్లు ఎలాంటి భయం, ఒత్తిడి, ప్రలోభాలకు గురికాకుండా తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చింది. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా ప్రజలు, రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిబంధనలను పాటిస్తూ అధికారులకు సహకరించాలని కోరింది.

12,244 కేంద్రాల్లో 1న పోలింగ్

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు కలెక్టర్లు, ఎస్పీలు, నగర పోలీసు కమిషనర్లు, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ఉన్నతాధికారులతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. 12,244 కేంద్రాల్లో 1న ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభవుతుంది. 1.03 కోట్ల మంది తమ ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌కు అవసరమైన సామగ్రిని కార్పొరేషన్లు, మున్సిపల్ కార్యాలయాలకు అధికారులు పంపించారు. వీటిని ఈనెల 31న పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక వాహనాల్లో తరలించనున్నారు. ఇదిలా ఉండగా ఎన్నికల నేపథ్యంలో నామినేషన్? వేసిన అభ్యర్థులు ప్రచారాలు ముమ్మరంగా చేస్తున్నారు. చాలా చోట్ల కూటమి అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ ప్రక్రియలో వైఎస్సార్సీపీ చతికిలబడిందని రాజకీయ నిపుణులు వెల్లడిస్తున్నారు.

మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరట

రాజమండ్రి : వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం వల్ల నిత్యావసర సరుకుల ధరలు నింగినంటుతుండటంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతర్జాతీయంగా, దేశీయంగా పెరిగిన ద్రవ్యోల్బణ భారాన్ని సామాన్యులపై పడకుండా నిరోధించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యూహాత్మక నిర్ణయం తీసుకున్నారు. రాబోయే దీపావళి పండుగ నుంచే రాష్ట్రంలోని పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ ద్వారా రేషన్ షాపుల్లో నిత్యావసర వస్తువులను మార్కెట్ ధరల కంటే సగానికి పైగా తక్కువ రేటుకే అందుబాటులోకి తేవాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు.ప్రభుత్వం ప్రకటించిన ప్రత్యేక సబ్సిడీ ప్రణాళిక ప్రకారం.. మార్కెట్‌లో కిలో రూ.160 నుంచి రూ. 180 వరకు పలుకుతున్న కందిపప్పును కేవలం రూ. 100 కే అందించనున్నారు. అలాగే లీటరు పామాయిల్‌ను రూ. 125 కే, గోధుమపిండిని కిలో రూ. 25 కే పంపిణీ చేయనున్నారు. వీటితో పాటు క్వాలిటీ బియ్యాన్ని తక్కువ ధరలకే అందించేందుకు ప్రత్యేక మొబైల్ వాహనాలు, రైతు బజార్లను విస్తృతంగా వినియోగించుకోవాలని నిర్ణయించారు. బహిరంగ మార్కెట్‌లో రేట్ల కృత్రిమ కొరతను అరికట్టేందుకు, ఉల్లిపాయల నిల్వలను కూడా నిరంతరం పర్యవేక్షించాల్సిందిగా అధికారులను సీఎం ఆదేశించారు.ప్రజా పంపిణీ వ్యవస్థ , రైతు బజార్ల ద్వారా తక్కువ ధరకు ఈ సరుకులను పంపిణీ చేయడం వల్ల రాష్ట్ర ఖజానాపై నెలకు దాదాపు రూ. 100 కోట్ల మేర అదనపు ఆర్థిక భారం పడుతుందని పౌరసరఫరాల శాఖ అధికారులు అంచనా వేశారు. అయితే, ఎంతటి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ఎల్ నినో వల్ల పెరిగిన ధరల నుంచి సామాన్యులకు ఊరట కల్పించడమే తమ కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల కడుపు నింపే విషయంలో సంక్షేమానికి వెనుకాడేది లేదని తేల్చిచెప్పారు.దీపావళి కానుకగా అందుబాటులోకి రానున్న ఈ పథకం ద్వారా రాష్ట్రంలో కోట్లాది మంది కార్డుదారులు , సామాన్య ప్రజలు నేరుగా లబ్ధి పొందనున్నారు. ఒకవైపు పండుగ సీజన్,మరోవైపు ఎల్ నినో ప్రభావంతో కూరగాయలు, దినుసుల ధరలు మండిపోతున్న తరుణంలో చంద్రబాబు తీసుకున్న ఈ నిర్ణయం మధ్యతరగతి గృహిణులకు ఎనలేని ఊరటనిస్తోంది. ప్రభుత్వం సకాలంలో స్పందించి చౌక ధరల సరుకులను రేషన్ డిపోల వేదికగా అందుబాటులోకి తేవడంపై పబ్లిక్ సర్కిల్స్‌లో హర్షం వ్యక్తమవుతోంది.

ఏలూరు మేయర్ పీఠం కోసం హోరాహోరీ

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ పట్టణ స్థానిక సంస్థల్లో అమలులోకి వచ్చిన ప్రత్యక్ష ఎన్నికల విధానంతో ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠం కోసం హోరాహోరీ సమరం నడుస్తోంది. కూటమి పొత్తు ఒప్పందంలో భాగంగా జనసేన పార్టీకి కేటాయించిన ఈ మేయర్ స్థానానికి ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు కూటమి ఉమ్మడి అభ్యర్థిగా బరిలో నిలవగా.. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గంటా మోహన్ రావు ప్రత్యర్థిగా తలపడుతున్నారు.కూటమి అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడికి స్థానిక రాజకీయాల్లో దశాబ్దాల క్షేత్రస్థాయి అనుభవం అతిపెద్ద బలం. గతంలో సుదీర్ఘకాలం టీడీపీలో ఉండి, సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, ఏలూరు మండల పరిషత్ అధ్యక్షుడిగా పనిచేసిన సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం ఆయనకుంది. 2019 నుంచి ఏలూరు జనసేన ఇన్‌చార్జ్‌గా పనిచేస్తూ పార్టీ కేడర్‌ను నిర్మించడంతో పాటు, ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్‌గా కార్మిక, ప్రజా సంఘాలతో ఆయనకు బలమైన అనుబంధం ఉంది. దీనికితోడు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చరిష్మా, టీడీపీ-జనసేన సంప్రదాయ కాపు, బీసీ, బలిజ ఓటు బ్యాంకు ఒక్కతాటిపైకి రావడం ఆయనకు కొండంత అడ్వాంటేజ్. అయితే, ఏలూరు మేయర్ సీటు తమకే కావాలంటూ ప్రారంభంలో స్థానిక టీడీపీ కేడర్, ఆశావహులు వ్యక్తం చేసిన తీవ్ర అసంతృప్తి, ఎమ్మెల్యే బడేటి చంటి వర్గంతో సమన్వయం సాధించడంలో తొలుత ఎదురైన అంతర్గత అసంతృప్తి అప్పలనాయుడికి కొంత ప్రతిబంధకంగా మారాయి.మరోవైపు వైసీపీ అభ్యర్థి గంటా మోహన్ రావు కూడా నగరంలో బలమైన ఆర్థిక, సామాజిక వనరులున్న నాయకుడిగా బరిలోకి దిగారు. నగరంలోని బీసీ వర్గాలతో పాటు, సంప్రదాయంగా వైసీపీ వెన్నంటి నిలిచే మైనార్టీ, ఎస్సీ , కొన్ని కార్మిక వాడల ఓటు బ్యాంకుపై ఆయన ప్రధానంగా ఆశలు పెట్టుకున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అమలైన సంక్షేమ పథకాల లబ్ధిదారులను కలుస్తూ, ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రచారం చేస్తూ కేడర్‌ను మోహరించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, గత మున్సిపల్ పాలకవర్గంపై ఏలూరు ప్రజల్లో ఉన్న తీవ్ర వ్యతిరేకత, గతంలో నగరంలో తాగునీటి కాలుష్యంతో పదుల సంఖ్యలో ప్రజలు అస్వస్థతకు గురైన చేదు జ్ఞాపకాలు ఇప్పటికీ నగరవాసుల మదిలో ఉండటం వైసీపీకి అతిపెద్ద మైనస్. అదీగాక, ఓటమి భయంతో నగరానికి చెందిన మాజీ మంత్రులు, కీలక వైసీపీ నేతలు ప్రచారానికి మొహం చాటేయడం, ఆయనకు పూర్తిస్థాయి అంగబలం కరువవ్వడం ప్రధాన బలహీనతగా మారింది.ఈ ఎన్నికల్లో డివిజన్ల స్థాయిలో కార్పొరేటర్ అభ్యర్థుల బలం మేయర్ పోరును ప్రత్యక్షంగా శాసిస్తోంది. నగరంలోని 62 డివిజన్లలో దాదాపు అన్ని చోట్లా కూటమి శ్రేణులు ముందస్తుగా సమన్వయ కమిటీలు వేసుకుని, బూత్ లెవల్ ప్రచారంలో స్పష్టమైన పైచేయి సాధించాయి. గతంలో తమ మధ్య ఉన్న అసంతృప్తులను పక్కనబెట్టి.. టీడీపీ ఎమ్మెల్యే బడేటి చంటి, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, జనసేన నేతలు ఏకతాటిపైకి వచ్చి అప్పలనాయుడి తరఫున ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మరోవైపు, వైసీపీకి చాలా డివిజన్లలో సమర్థులైన కార్పొరేటర్ అభ్యర్థులే దొరక్కపోవడం, బరిలో ఉన్నవారు సైతం సొంత ఖర్చులతో రిస్క్ తీసుకోలేక చతికిలపడటం మేయర్ అభ్యర్థి గంటా మోహన్ రావుకు క్షేత్రస్థాయిలో గొడ్డలిపెట్టుగా మారింది. సామాజిక సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే.. ఏలూరు నగరంలో దాదాపు 60 శాతానికి పైగా ఉన్న బీసీ, కాపు, వైశ్య, ఉద్యోగ వర్గాలు కూటమి ప్రభుత్వ అభివృద్ధి ఎజెండా, పెన్షన్ల పెంపు, దీపం-2' వంటి సంక్షేమ పథకాల వైపే స్పష్టంగా మొగ్గుచూపుతున్నాయి. అప్పలనాయుడికున్న క్లీన్ ఇమేజ్, స్థానిక నాయకత్వ పట్టు ఆయనకు సాధారణ తటస్థ ఓటర్లలోనూ ఆదరణ తెచ్చిపెడుతోంది. వైసీపీ కేవలం తమ పాత సంప్రదాయ ఓట్లను మాత్రమే నిలుపుకోగలుగుతుండగా, కొత్తగా ఓటర్లను ఆకర్షించే అంశాలేవీ ఆ పార్టీ వద్ద లేకపోవడం ప్రచారంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.మేయర్ ప్రత్యక్ష పోరులో కూటమి-జనసేన అభ్యర్థి రెడ్డి అప్పలనాయుడికే దాదాపు 65 నుంచి 70 శాతం మేర స్పష్టమైన విజయావకాశాలు కనిపిస్తున్నాయి. టికెట్ కేటాయింపు సమయంలో తలెత్తిన విభేదాలను అధిగమించి కూటమి శ్రేణులు ఏకతాటిపైకి రావడం ఆయనకు అతిపెద్ద రక్షాకవచంగా మారింది. దీంతో గంటా మోహన్ రావు గట్టి పోటీ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నప్పటికీ.. ఏలూరు నగర పాలక సంస్థ మేయర్ పీఠాన్ని కూటమి కైవసం చేసుకుని, అక్కడ జనసేన జెండా ఎగరడం దాదాపు లాంఛనమేనని అనుకోవచ్చు.



యువతకు ఆదర్శప్రాయులు
సర్దార్ వల్లభాయ్ పటేల్

- ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు
- రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించిన ప్రకాశం జిల్లా పోలీసులు





ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 30

దేశ సమగ్రత, ఐక్యత కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రకాశం జిల్లా ఎస్పీ వి.హర్ష వర్ధన్ రాజు కొనియాడారు. ఆయన ఆశయాలు, ఆదర్శాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ అంకితభావంతో విధులు నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా ఎస్పీ , అధికారులు, సిబ్బంది పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, భారతదేశ గొప్ప నాయకుల్లో ఒకరైన, 'ఉక్కు మనిషి'గా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని 'వేడుకలను జాతీయ ఐక్యతా దినోత్సవం గా జరుపుకుంటున్నామని తెలిపారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన సమయంలో దేశం అనేక చిన్న చిన్న సంస్థానాలుగా విడిపోయి ఉండేదని, ఆ సమయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ తన అసాధారణమైన సంకల్పబలం, దూరదృష్టి, సమర్థవంతమైన నాయకత్వంతో 560కి పైగా సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారన్నారు. దేశాన్ని భౌగోళికంగా ఒక తాటిపైకి తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుందని, అందుకే ఆయనను భారతదేశపు "బిస్మార్క్" అని పిలుస్తారని పేర్కొన్నారు. దేశ ఐక్యత, సమగ్రతను కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని జాతీయ ఐక్యత, సమగ్రతను కాపాడుతూ, దేశ సార్వభౌమత్వ పరిరక్షణకు అంకితభావంతో కృషి చేస్తామని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. సిబ్బంది చేత జిల్లా ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా భారత జాతిని ఐక్యం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించిన భారత ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని రన్ ఫర్ యూనిటీ (ఐక్యత కొరకు పరుగు) కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పరుగు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమై, ఆర్టీసీ బస్టాండ్ వరకు కొనసాగి, తిరిగి జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకుంది. ఈ పరుగులో పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ యన్.యుగంధర్ బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పి నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్పీ కె. శ్రీనివాసరావు, ఒంగోలు టౌన్ సీఐ లు విజయకృష్ణ, వీర నాయక్, వెంకటేశ్వరరావు, ఒంగోలు రూరల్ సీఐ శేషగిరి రావు, ట్రాఫిక్ సీఐ చావా హాజరత్తయ్య, ఆర్ఐలు రమణ రెడ్డి, సీతారామిరెడ్డి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం - ప్రకాశం

ప్రచారానికి తెర.. మూగబోయిన మైకులు

శుక్రవారం సాయంత్రం 5 గంటలకు మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగింపు..

నవంబర్ 1న పోలింగ్, 3న ఫలితాలు.



గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 30

మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి శుక్రవారం సాయంత్రం 5 గంటలకు తెరపడింది మైకులు మూగబోయాయి. గత కొద్ది రోజులుగా హోరాహోరీగా సాగుతున్న ఎన్నికల ప్రచారంలో ప్రధాన రాజకీయ పార్టీలు ఓటర్లను ఆకట్టుకునేందుకు సర్వశక్తులూ ఒడ్డాయి. ర్యాలీలు, రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారాలు, నాయకుల పర్యటనలతో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. ప్రచార గడువు ముగియనుండటంతో అభ్యర్థులు చివరి అస్త్రాలకు పదును పెడుతున్నారు. నవంబర్ 1వ తేదీన పోలింగ్ జరగనుండగా, నవంబర్ 3వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. దీంతో గిద్దలూరు, మున్సిపాలిటీల్లో రాజకీయ పోరు ఆసక్తికరంగా మారింది. రెండు ప్రధాన రాజకీయ పక్షాలు పోటాపోటీగా ఓటర్ల మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నించాయి. అభ్యర్థులు, నేతలు తమదే విజయమనే ధీమాతో ముందుకు సాగుతున్నారు. ముఖ్యంగా మున్సిపల్ చైర్మన్ పీఠం ఎవరిని వరిస్తుందన్న అంశం రాజకీయ వర్గాల్లోనే కాకుండా సామాన్య ప్రజల్లోనూ తీవ్ర చర్చకు దారితీస్తోంది. అభ్యర్థుల గెలుపోటములపై ఎవరికి వారు అంచనాలు వేసుకుంటున్నారు. ప్రచారంలో కనిపించిన జనసందోహం ఓట్లుగా మారుతుందా? ఓటరు ఎవరికి పట్టం కడతారు? అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. నేటి సాయంత్రంతో ప్రచార హోరు ముగియనుండగా, ఇక ఓటరు తీర్పు కోసం అభ్యర్థులు, రాజకీయ నాయకులు ఉత్కంఠగా ఎదురుచూడనున్నారు. నవంబర్ 1న ఓటరు వేసే ఓటు.. నవంబర్ 3న వెలువడే ఫలితం గిద్దలూరు మున్సిపాలిటీల రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనుంది. శుక్రవారం కూటమి నిర్వహించిన ర్యాలీ బిజెపికి అనుకూలంగా ఉన్నట్లు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

బోరు మోటారు కేబుల్ వైర్ల చోరీతో అన్నదాతలకు కష్టాలు



పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబర్ 30

పుల్లలచెరువు మండల కేంద్ర పరిసర ప్రాంతాల్లో దొంగలు బీభత్సం సృష్టిస్తున్నారు. చివరకు పొట్టకూటి కోసం అప్పులు చేసి, కౌలుకు భూములు తీసుకొని సాగు చేసుకుంటున్న రైతులను సైతం వదలడం లేదు.వ్యవసాయానికి అవసరమైన మోటారు కేబుల్ వైర్లను గుర్తుతెలియని దుండగులు అపహరిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.అసలే ఎల్‌నినో ప్రభావంతో మండలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.పరిమితంగా కురిసిన వర్షాలను నమ్ముకొని మిరప పంట సాగు చేపట్టిన రైతులకు ఇప్పుడు దొంగల బెడద మరో సమస్యగా మారింది. పంటలకు నీరు అందించేందుకు ఏర్పాటు చేసుకున్న బోరుబావుల వద్ద మోటారు కేబుల్ వైర్లను దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.పుల్లలచెరువుకు చెందిన కౌలు రైతు ఆరేవుల పౌలు ఐదు ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మిరప పంట సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో బోరులోని మోటారు మరమ్మతులకు గురికావడంతో ట్రాక్టర్ క్రేన్ సహాయంతో మోటారును బోరు నుంచి బయటకు తీయించి, మరమ్మతుల నిమిత్తం మెకానిక్ వద్దకు తీసుకెళ్లాడు.తిరిగి వచ్చేసరికి బోరు వద్ద ఉన్నసుమారు 150 మీటర్ల కేబుల్ వైర్‌ను గుర్తుతెలియని దుండగులు అపహరించినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.ఇప్పటికే పెట్టుబడులు, కౌలు ఖర్చులు, సాగునీటి ఇబ్బందులతో సతమతమవుతున్న తమకు కేబుల్ వైర్ల చోరీ మరింత భారంగా మారిందని రైతులు వాపోతున్నారు.రాత్రివేళల్లో పొలాల వద్ద నిఘా లేకపోవడంతో దొంగలు రెచ్చిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

దొంగల ముఠాను పట్టుకోవాలి!..: వ్యవసాయ మోటార్ల కేబుల్ వైర్ల చోరీలపై పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు. పొలాల వద్ద నిఘా పెంచి, చోరీలకు పాల్పడుతున్న దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు తగిన చర్యలు చేపట్టి రైతులకు భరోసా కల్పించాలని కోరుతున్నారు.

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి వాగ్బాణాలు

ప్రజలను ఆలోచింపచేసాయి

జన్మభూమి పై ఉన్న ప్రేమ అభిమానం ,కార్మభూమి పై ఉండవు కేవలం సంపాదనే ధ్యేయం తప్ప






గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 30

గిద్దలూరు మున్సిపాలిటీ లో జరుగుతున్న ఎన్నికల సందర్భంగా గురువారం నిర్వహించిన భారీ ర్యాలీ నుద్దేశించి గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి వాగ్బాణాలు వదిలి వైకాపాను డోలాయమనంలో పడవేశారు. ఆయన వైకాపా చైర్మన్ అభ్యర్థి పై చేసిన వ్యాఖ్యలు ప్రజలను ఆలోచింపచేశాయి. కర్మభూమికి జన్మభూమికి అర్ధం వివరించి ఎద్దేవా చేశారు. జన్మభూమి పై ఉన్న ప్రేమాభిమానాలు కర్మభూమి పై ఉండవన్నారు. మీరు కేవలం గిద్దలూరు కు సంపాదన కోసం వచ్చి గిద్దలూరు లో వైద్యశాల ఏర్పాటు చేసి విపరీతంగా డబ్బు సంపాదించారని, వైద్యసేవలు అర్హమైనవా, లేదా అనర్హమైనవా ఒక్కసారి ఆలోచించుకో , నీ అర్హతలకు మించి ఆపరేషన్లు చేసి ఎందరో ప్రాణాల ను తీశావని ఆరోపించారు అనర్హమైన చేసేందుకు నీకు అర్హతలు ఉన్నాయాయని ప్రశ్నించారు. బిజెపి తరుపున బరిలో ఉన్న డాక్టర్ జేవీ నారాయణ ఆరేమ్పి అయినా వైద్యసేవలు అందించారు తప్ప ఆపరేషన్లు చేసి ప్రాణాలు తీయలేదని కౌంటర్ ఇచ్చారు. ఇలా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి వాగ్బాణాలు సంధించారు. వైఎస్సార్ సీపీ చైర్మన్ అభ్యర్థి వైద్యంలో , ఆపరేషన్లు చేసేందుకు ఉన్నఅర్హ తలను బహిర్గతం చేయాలని కోరారు కూటమి ద్వారానే అభివృద్ధి సాధ్యమని, అభివృద్ధి లక్ష్యంగా తామంతా పనిచేస్తున్నామని , ఈ రెండు సంవత్సరాలు లో కోట్ల రూపాయల తో అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ , బిటి రోడ్లు నీటి సరఫరా ఇతర మౌలిక సదుపాయాలు కలిపించామని ఈ అభివృద్ధి కండ్ల ముందే ఉందన్నారు. త్వరలో రాచర్ల రోడ్డు రైల్వే క్రాసింగ్ పై ఓఆర్ వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తామని , కాసిరెడ్డికుంటను సుందరంగా మారుస్తున్నామని దుఃఖదాయినీగా ఉన్న సగిలేరు వాగు కు రిటైన్ వాల్ నిర్మాణం చేస్తామని తెలిపారు , మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి డాక్టర్ జె వి నారాయణను కూటమి కౌన్సిలర్ అభ్యర్థుల ను ఓట్లు వేసి విజయం చేకూర్చాలని అశోక్ రెడ్డి కోరారు . చెప్పాం చేసి చూపిస్తున్నామని పేర్కొన్నారు.

మునిసిపల్ ఎన్నికలకు
సర్వం సిద్ధం

- జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు





స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 30

మునిసిపల్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసామని జిల్లా కలెక్టర్ పి.రాజా బాబు తెలిపారు. జిల్లాలవారీగా పరిస్థితిని తెలుసుకునేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేతా శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అబ్జర్వర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి జిల్లా ఎన్నికల పరిశీలకులు కె.హెప్సిబా రాణి, వ్యయ పరిశీలకులు వివేక్ , ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారిలతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పరిస్థితిని వివరించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చి సకాలంలో వారు డిస్ట్రిబ్యూషన్ సెంటరుకు చేరుకునేలా ఏర్పాట్లు చేసామన్నారు. పోలింగ్ అనంతరం స్ట్రాంగ్ రూములకు భద్రత మధ్య బ్యాలెట్ బాక్స్ లను తరలించేలా రవాణా ఏర్పాట్లు కూడా చేసినట్లు తెలిపారు. ఒంగోలు కార్పొరేషన్ తో పాటు చీమకుర్తి, అద్దంకి మున్సిపాలిటీలకు ఒంగోలు శివారులోని ఇంజనీరింగ్ కాలేజీలో కౌంటింగ్ సెంటర్ కేటాయించామన్నారు. మున్సిపల్ ఎన్నికలు, కౌంటింగ్ ప్రశాంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. ఎస్పీ మాట్లాడుతూ అత్యంత సమస్యాత్మక, సమస్యాత్మక, సాధారణ కేటగిరీలుగా పోలింగ్ కేంద్రాలను విభజించి, స్థానిక పరిస్థితులను బట్టి అవసరమైన పోలీసు సిబ్బందిని మోహరిస్తున్నట్లు చెప్పారు. డ్రోన్లు, బాడీ వేర్ కెమెరాలతో పటిష్ట నిఘా పెడుతున్నట్లు తెలిపారు. పరిశీలకురాలు మాట్లాడుతూ వచ్చే రెండు రోజులు మరింత అప్రమత్తంగా ఉంటామన్నారు. ఎలాంటి ఆటంకాలు లేకుండా స్వేచ్ఛగా, పారదర్శకంగా జిల్లాలో ఎన్నికల ప్రక్రియ ముగిసేలా చూస్తామన్నారు. ఎన్నికల ప్రచారం ముగిసినందున బార్లు, మద్యం దుకాణాలను కూడా మూసి వేయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అధికారి ఆయేషా బేగం, అర్బన్ ఎలక్షన్స్ నోడల్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు పటిష్టమైన ఏర్పాట్లు

ఎన్నికల నిర్వహణ అధికారిని నిర్మలాదేవి



పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 30

మండలంలో జరగనున్న ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల నిర్వహణ కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్నికల నిర్వహణ అధికారిని నిర్మల దేవి చెప్పారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా ఆమె శుక్రవారం నాడు మండలంలోని మల్లవరం, సూ ధన గుంట గ్రామాల పరిధిలోని పలు పోలింగ్ స్టేషన్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ అధికారిని నిర్మలాదేవి ఎన్నికల పోలింగ్ సరళి ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆయా పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఆమె అవసరమైన సలహాలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ అధికారిని నిర్మలాదేవి వెంట ఎంపీడీవో శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి మారేళ్ల పద్మ తదితరులు ఉన్నారు.

గిద్దలూరు మున్సిపాలిటీలో ఎన్నికల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ విజయ్ సునీత ఉన్నతాధికారులు పరిశీలించారు





గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 30

గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో గిద్దలూరు మున్సిపాలిటీలో జిల్లా కలెక్టర్, విజయ సునీత జాయింట్ కలెక్టర్, పులి శ్రీనివాసులు జిల్లా ఎస్పీ పంకజ్ మీనా లు శుక్రవారం సాయంత్రం ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై అధికారులతో చర్చించి, అవసరమైన సూచనలు చేశారు ఎన్నికల ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటిస్తూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని తెలిపారు. మున్సిపల్ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ప్రొహిబిషన్ – ఎక్సైజ్ స్టేషన్, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక తనిఖీలు

మద్యం దుకాణాలు, బార్లు, మిలటరీ క్యాంటీన్ మూసివేత

గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 30

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్, ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్, ఆదేశాల మేరకు, గిద్దలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక చర్యలు చేపట్టారు ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం రవాణా, విక్రయాలు వినియోగాన్ని అరికట్టేందుకు రూట్ వాచ్, వాహన తనిఖీలు, రైళ్లలో తనిఖీలు, పార్సిల్ కార్యాలయాల తనిఖీలు నిర్వహించారు. అదేవిధంగా బెల్ట్ షాపుల నిర్వహణను నియంత్రించడంతో పాటు, ఎన్ డి పి ల్ మద్యం, నాటుసారా తయారీ విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక దాడులు నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు శుక్రవారం సాయంత్రం 5 గంటలకు గిద్దలూరు పట్టణ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్ ఉ రెస్టారెంట్లు, మిలటరీ క్యాంటీన్‌లను మూసివేసి సీల్ వేశారు. ఈ దుకాణాలు, బార్లు, క్యాంటీన్‌లు ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం, అనుమతించిన సమయానికి తిరిగి తెరవబడతాయి. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు, ఎన్నికల నియమావళిని సమర్థవంతంగా అమలు చేసేందుకు ఎక్సైజ్ శాఖ నిరంతరం నిఘా ఉంచి, అక్రమ మద్యం రవాణా, విక్రయాలు, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటుందని వీ. జయరావు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



జయహో... జయహో... ముత్తుముల అశోక్ రెడ్డి

గిద్దలూరు గడ్డపై జనసంద్రం... –కూటమి ర్యాలీలో ప్రజాభిమానం వెల్లువ!

గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 30

గిద్దలూరు మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నాయకత్వంలో గురువారం నిర్వహించిన కూటమి భారీ ర్యాలీ గిద్దలూరు పట్టణంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గాంధీ బొమ్మ సెంటర్ నుంచి చిన్న మార్కెట్ వరకుసాగిన ఈ ర్యాలీ జనసంద్రాన్ని తలపించింది. ఎటు చూసినా ప్రజల సందడి... కూటమి జెండాల రెపరెపలు... కార్యకర్తల నినాదాలు... అశోక్ రెడ్డి కి ప్రజలు భాజాభజంత్రీలతో దుశ్శాలువల్తో గజమాలల్తో ఘన పలికి స్వాగతం పలికారు. కూటమి నాయకులు ,కార్యకర్తలు బిగ్గరగా నినాదాలు చేయగా గిద్దలూరు వీధులు పిక్కటిల్లాయి,పసుపు జెండాలు, కాషాయం జెండాలు , తెలుపు వర్ణం జెండాలతో పట్టణం రంగులమయం అయింది తమ పనులను, వ్యాపారాలను పక్కనపెట్టి షాపుల నుంచి బయటకు వచ్చిన వ్యాపారులు, ఇళ్ల నుంచి స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాటు కూటమి నాయకులతో అడుగులు కలిపి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఒకవైపు ప్రజల నీరాజనాలు... మరోవైపు కార్యకర్తల ఉత్సాహం... మధ్యలో ప్రజలతో మమేకమవుతుండగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కూటమి నేతలతో కలిసి ముందుకు సాగారు ర్యాలీలో కనిపించిన జనసందోహం, ప్రజల ఉత్సాహం గిద్దలూరు పట్టణంలో రాజకీయ ప్రచారానికి కొత్త ఉత్సాహాన్ని తీసుకొచ్చాయి. ప్రతి వీధిలోనూ వినిపించిన



నినాదాలు, ప్రతి అడుగులోనూ కనిపించిన అభిమానంతో పట్టణమంతా సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, రాష్ట్ర, జాతీయ స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గిద్దలూరు అభివృద్ధి ప్రస్థానంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నాయకత్వం, ప్రజలతో ఆయనకున్న అనుబంధం ఈ ర్యాలీ ద్వారా మరోసారి ప్రజల దృష్టిని ఆకర్షించారు.



కూటమి అభ్యర్థి డాక్టర్ జె.వి నారాయణకు సానుకూల పవనాలు

కూటమి ఐక్యతతో ముందడుగు



గిద్దలూరు, పెన్ పవర్, అక్టోబర్ 30

ఎవరూ ఊహించని విధంగా గిద్దలూరు పురపాలక సంఘం చైర్ పర్సన్ పదవికి అధికార కూటమి పక్ష అభ్యర్థిగా స్థానిక వైద్యులు డాక్టర్ జె.వి నారాయణను ఆ పార్టీ బరిలో నిలిపింది.నామినేషన్ల పర్వంలోనూ, ఉపసంహరణల సందర్భంలో తొలుత కొన్ని అవరోధాలు, ప్రతికూలతలు ఎదురైనా కూటమి రాష్ట్ర స్థాయి అధిష్టానం, స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి చొరవతో బాలారిష్టాలన్నీ తొలగి కూటమి ఐక్యంగా ముందుకు



సాగింది. దీంతో డాక్టర్ జెవి నారాయణ తన ప్రత్యర్థి వ్యూహాలను అధిగమించాడని పరిశీలకులు భావిస్తున్నారు. కూటమిలో ప్రధాన పక్షాలైన తెలుగుదేశం,జనసేన శ్రేణులు కూటమి అభ్యర్థిత్వాన్ని త్రికరణ శుద్ధితో బలపరచి ప్రచారం నిర్వహించారు. ప్రచార పర్వం ముగింపు రోజు శుక్రవారంనాడు కూటమి పక్షాలు నిర్వహించిన 'రోడ్డు షో' విజయవంతం కావడంతో కూటమి శ్రేణులన్నీ జోష్ గా ఉన్నాయి. వార్డు కౌన్సిలర్ పదవులకు పోటీ చేసిన కూటమి భాగస్వామ్య పక్షాల అభ్యర్థులు,వారి ప్రచారకర్తలు కూడా చైర్ పర్సన్ అభ్యర్థి డాక్టర్ జె.వి నారాయణకు సంపూర్ణ మద్దతుగా ప్రచారంలో పాల్గొన్నారు. దీంతో డాక్టర్ జె.వి నారాయణ విజయావకాశాలు మెరుగయ్యాయని పరిశీలకులు భావిస్తున్నారు. అంతే కాకుండా స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ప్రత్యర్థి పార్టీ అభ్యర్థి స్థానికతపై, ఆయన వృత్తిపరమైన అర్హతానర్హతలపై స్వరం పెంచి సూటిగా ప్రశ్నలు సంధించి, ఓటర్లలో ఆలోచనను రేకెత్తించారు.

అద్దంకి సమగ్రాభివృద్ధే లక్ష్యం

మంత్రి గొట్టిపాటి రవికుమార్

రూ.101 కోట్లతో తాగునీటి పథకం.. ఏడాదిలోగా పూర్తి చేస్తామని వెల్లడి.



అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) అక్టోబర్ 30:

అద్దంకి పట్టణాన్ని అన్ని రంగాల్లో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణంలో నిర్వహించిన పురపాలక ఎన్నికల ప్రచారంలో కూటమి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి కాకాణి అశోక్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. పట్టణ ప్రగతిని కాంక్షిస్తూ కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

రూ.101 కోట్లతో తాగునీటి పథకం..

అద్దంకి పట్టణ భవిష్యత్ అవసరాల కోసం రూ.101 కోట్ల వ్యయంతో చేపట్టిన రక్షిత మంచినీటి పథకాన్ని ఏడాదిలోగా పూర్తి చేసి ప్రజలకు



అందుబాటులోకి తెస్తామని మంత్రి తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నిషేధిత జాబితాలో ఉన్న భూములకు విముక్తి కల్పించి ప్రజల దీర్ఘకాలిక సమస్యను శాశ్వతంగా పరిష్కరించామన్నారు. పట్టణంలో విద్యుత్ వ్యవస్థ బలోపేతానికి మూడు ఉపకేంద్రాలు నిర్మించడంతో పాటు 40 ఏళ్ల నాటి పాత స్తంభాలను మార్చామని చెప్పారు. రాకపోకల సౌలభ్యం కోసం రూ.32 కోట్లతో దర్శి–అద్దంకి ఎత్తైన వంతెన, రూ.5.70 కోట్లతో బస్టాండ్ ఆధునికీకరణ పనులు చేపట్టబోతున్నట్లు వివరించారు. అలాగే ప్రత్యేక నిధులతో నూతన గ్రంథాలయం, పురమందిరం, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి అద్దంకిని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మంత్రి పేర్కొన్నారు.

ఉక్కు సంకల్ప (సర్దార్ వల్లభాయ్ పటేల్) వికాసనికి జయంతి శుభాకాంక్షలు



అఖండ భారతావనికి ఆత్మబంధువు -- మన సర్దార్!
కోటి ప్రణామాల త్రివర్ణ పతాకమై,
దిశలు పిక్కటిల్లే సింహ గర్జనమై,
ముక్కలైన నేలను ఒక్కటిగా కూర్చిన శిల్పివై,
నిలిచావు నింగిల నిశ్చల శైలమై!
గుజరాతు మట్టిలో రగిలిన విప్లవ తేజం,
బార్డోలీ పోరులో గెలిచిన ప్రజా సైన్యం,
రైతన్నల గుండెల్లో గుబులు బాపిన ధైర్యం,
"సర్దార్" అని జగమంతా కొనియాడిన సైన్యం!
ఆంగ్లేయులు వదిలిన ఆరువందల సంస్థానాలు,
చెల్లాచెదురై పోయిన భరతమాత ప్రేమానురాగాలు,
సామ, దాన, భేద, దండోపాయాల కత్తులతో,
కలిపావు అన్నీ ఒక్కటే భారత స్వరూపంతో!
హైదరాబాద్ నెత్తుటి గాయాన్ని మాన్పించిన వీరుడా,
జునాగఢ్ కట్టుకథలను తుంచిన శూరుడా,
నీ ఉక్కు సంకల్పం ముందర రజాకార్లు వణికిరి,
నీ ధర్మ ఆగ్రహం ముందర కుట్రలన్నీ లొంగిరి!
ఆకాశమంత ఎత్తు నీ విగ్రహమే కాదు పటేల్,
నీ త్యాగ నిరతికి ఈ దేశమే తలవంచును పటేల్!
కాశ్మీరు నుండి కన్యాకుమారి వరకు ఒక్కటే శ్వాస,
"జాతీయ ఐక్యత" రూపంలో చిరస్థాయి నీ ధ్యాస!
తరాలు మారినా నీ పేరు ఒక ప్రభంజనం,
యుగాలు గడిచినా నీ అడుగులు మా మార్గదర్శనం!
భారత రత్నమా... ఓ ఉక్కు మనిషి పటేల్,
జాతీయ ఐక్యతా దివసాన నీకు శతకోటి వందనాలు!
జాతీయ ఐక్యతా దినోత్సవ (రాష్ట్రీయ ఏకతా దివస్) శుభాకాంక్షలు!

రచన: వై. శ్రీకాంత్.

పొదిలి శివాలయాన్ని సందర్శించిన పుష్పగిరి పీఠాధిపతి

పొదిలి, పెన్ పవర్, అక్టోబర్ 30

స్థానిక నిర్మ మహేశ్వర స్వామి దేవాలయాన్ని పుష్పగిరి పీఠాధిపతి జగద్గురు విద్యా శంకర భారత మహాస్వామి సందర్శించారు. శుక్రవారం నాడు ఆయన చారిత్రాత్మకమైన నిర్మ మహేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించడంతోపాటు స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. ఒక ప్రైవేటు కార్యక్రమానికి విచ్చేసిన జగద్గురు శంకర భారత మహాస్వామి శివాలయాన్ని సందర్శించి ఎంతో తన్మయత్వం పొందారు. ముందుగా జగద్గురు స్వామివారికి ఆలయ కమిటీ చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు కాటూరి వెంకటనారాయణ బాబు, కళ్ళం వెంకటసుబ్బారెడ్డి, మేడా నరసింహారావు, ఎక్కాలి శేషగిరిరావు, డాక్టర్ మనీ తోపాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంతంగా పురపాలక ఎన్నికల నిర్వహణ: కలెక్టర్ పి.రాజాబాబు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల ఏర్పాట్లు, పంపిణీ కేంద్రం పరిశీలన.

ప్రతి పోలింగ్ గదిలో వెబ్ ప్రసార నిఘా.. నిర్భయంగా ఓటు వేయాలని పిలుపు.





అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) అక్టోబర్ 30

ప్రకాశం జిల్లాలో పురపాలక ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శక వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. శుక్రవారం ఆయన అద్దంకి పట్టణంలో పర్యటించి, స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్నికల నిర్వహణ కోసం చేపట్టిన ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం కూడా ఇక్కడే ఏర్పాటు చేయడంతో అధికారులకు పలు కీలక ఆదేశాలు, సూచనలు జారీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లోకి ఓటర్లు ప్రవేశించేందుకు, బయటకు వచ్చేందుకు వేర్వేరుగా మార్గాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఇప్పటికే పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా గట్టి పోలీసు బందోబస్తు మోహరిస్తున్నట్లు చెప్పారు. పారదర్శకత కోసం ప్రతి పోలింగ్ గదిలో కెమెరాల ద్వారా ప్రత్యక్ష వెబ్ ప్రసార నిఘా ఏర్పాటు చేశామని, దీనిని జిల్లా యంత్రాంగంతో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం కూడా నిరంతరం పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలు ఎంతో కీలకమైనవని, ఓటర్లందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ?ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, డీఎస్పీ బాలమురళీకృష్ణ, తహశీల్దార్ చరణ్, ఇతర శాఖల అధికారులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడికి పాల్పడిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

కలెక్టర్, ఎస్పీలకు ఏపీయూడబ్ల్యూజే నాయకుల వినతి



మార్కాపురం, పెన్ పవర్ అక్టోబర్ 30

నంద్యాల జిల్లా ఆత్మకూరులో సాక్షి దినపత్రిక విలేకరి సుబ్బారెడ్డిపై దాడికి పాల్పడిన నిందితులను తక్షణమే అరెస్ట్ చేసి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మార్కాపురం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయ సునీత, ఎస్పీ పంకజ్ కుమార్ మీనాలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి. రమణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వార్తల సేకరణకు వెళ్లిన విలేకరి సుబ్బారెడ్డిపై దాడి చేయడం ఆందోళనకరమన్నారు. రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు పెరుగుతుండటం విచారకరమని పేర్కొన్నారు. జర్నలిస్టులపై దాడులు ప్రజాస్వామ్యానికి, భావప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తాయని అన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మూల అల్లూరి రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బంకా శ్రీనివాసరావు, కోశాధికారి డి. బాబీ, డి. జగన్నాథరెడ్డి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థుల విజయానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రచారం

జడ్పీటీసీ అభ్యర్థి దొండపాటి సుబ్బరాజుతో పాటు ఎంపీటీసీ అభ్యర్థులకు మద్దతుగా విస్తృత పర్యటన



ఆలమూరు, పెన్ పవర్ అక్టోబర్ 30

ఆలమూరు మండలంలో జడ్పీటీసీ అభ్యర్థి దొండపాటి సుబ్బరాజుతో పాటు 21 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం బడుగువానిలంక గ్రామం నుంచి ప్రచారాన్ని ప్రారంభించి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కొత్తపేట జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, భాజపా నాయకుడు తమలంపూడి రామకృష్ణారెడ్డితో కలిసి ఓటర్లను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో ఉందని, స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారానికి ప్రజల నుంచి స్పందన వస్తోందని పేర్కొన్నారు. కూటమిలోని భాగస్వామ్య పార్టీల నాయకులు సమన్వయంతో పనిచేస్తూ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కొత్తపల్లిలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ



గుమ్మడిదల, పెన్ పవర్ అక్టోబర్ 30


గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో మండల పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. శుక్రవారం నాడు వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ వేదమూర్తులు పోచమ్మ తల్లి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ వి.ఆదర్శ్ రెడ్డి, రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి కొలన్ బాల్రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ హాజరై పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మంజుల సత్తయ్య, ఉప సర్పంచ్ రామేశ్వరి ఉమారెడ్డి, అనంతారం సర్పంచ్ కొమ్ము శీను, తొంట అంజయ్య, దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

9,18వ వార్డుల్లో కూటమి అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

అభివృద్ధి అంశాలతో ప్రజల్లోకి వెళ్లిన కూటమి నాయకులు

అమలాపురం, పెన్ పవర్ అక్టోబర్ 30

అమలాపురం మున్సిపాలిటీలోని 9, 18వ వార్డుల్లో కూటమి అభ్యర్థుల తరఫున ఇంటింటి ఎన్నికల ప్రచారం ఉత్సాహంగా సాగింది. మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్, 9వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి అప్పారి లక్ష్మీదేవి, 18వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి రాయుడు వెంకట గోపాలకృష్ణకు మద్దతుగా నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు మాట్లాడుతూ అమలాపురం పట్టణ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన తమ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. పట్టణ అభివృద్ధికి సంబంధించిన అంశాలను ప్రజలకు వివరిస్తూ, కూటమి అభ్యర్థుల తరఫున ఓట్లు అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పి.గన్నవరం శాసనసభ్యుడు గిడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



గిద్దలూరు లో కూటమి రెండేళ్లలో అభివృద్ధి కండ్లు ఎదుటే

గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 30

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కృషి తో రెండేళ్లలో గిద్దలూరు పలు వార్డులో పలు అభివృద్ధి పనులు చేపట్టి ముందడుగు వేయించారు. ఇప్పటికే చేసిన - చేస్తున్న అభివృద్ధి పనులు గిద్దలూరు మున్సిపాలిటీ --- 1వ వార్డు (పాత వార్డు) మొత్తం అభివృద్ధి పనుల విలువ ?57.40 లక్షలు ,సి సి రోడ్ల నిర్మాణం రూ 53.50 లక్షలు ,డ్రెయిన్ నిర్మాణం రూ3.90 లక్షలు మొత్తం పనులు- 5 గిద్దలూరు మున్సిపాలిటీ అధికారిక రికార్డుల్లో నమోదైన అభివృద్ధి పనుల వివరాలు ఇలాఉన్నాయి. గిద్దలూరు అభివృద్ధి... ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కలిపించాం. 2వ వార్డు (పాతవార్డు) మొత్తం పనుల విలువ: రు44.71 లక్షలు సీసీ రోడ్ల పనుల విలువ: రూ 35.01 లక్షలపూర్తయిన రోడ్డు పనులు: 3 ప్రారంభించిన రోడ్డు పనులు: 2 ప్రారంభించిన పనుల విలువ: ?9.70 లక్షలు మొత్తం రోడ్డు పనులు: 5 గిద్దలూరు మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల జోరు 3వ వార్డు (పాత వార్డు) అభివృద్ధి పనుల విలువ ?50 లక్షలు పనులు పూర్తయినవి.

గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నాయకత్వంలో గిద్దలూరు పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సీసీ రోడ్ల పనులు: 5 పూర్తయిన రోడ్డు పనులు: 5 పనులు మొత్తం పనుల విలువ: రు50 లక్షలు

పాత 4వ వార్డు అభివృద్ధి పనుల విలువ రూ33.85 లక్షలు. సి సిరోడ్ల పనులు: 2 సి సి రోడ్ల పనుల విలువ: ?19.00 లక్షలు. డ్రెయిన్ల పనులు: సి సి డ్రెయిన్ల పనుల విలువ: ?14.85 లక్షలు

మొత్తం పనులు: 4. మొత్తం పనుల విలువ: ?33,85, పాత5వ వార్డులో సి సి డ్రెయిన్ నిర్మాణ పనులకు రు12 లక్షలు. సి సిడ్రెయిన్ పనులు: 1 పనుల విలువ: రు12,00,00 మొత్తం పనుల విలువ: ?12.00 లక్షలు

ప్రతి వార్డు అభివృద్ధి... గిద్దలూరు ప్రగతికి మరో అడుగు

పాత 6వ వార్డు అభివృద్ధి పనుల విలువ 15.20 లక్షలు సి సి రోడ్డు పనులు: పనుల విలువ: 4.00 లక్షలు

సి సి డ్రెయిన్ 1 పనులు: పనుల విలువ: రూ11.20 లక్షలు

పూర్తయిన పనులు: 1 ప్రారంభించిన పనులు: 1

మొత్తం అభివృద్ధి పనుల విలువ: ?15,20,000

పాతలి7వ వార్డు అభివృ విలువ అక్షరాలా ?79 లక్షలుసి సి రోడ్ల పనులు: 9 రోడ్ల పనుల విలువ: రూ77.00 లక్షలు

పూర్తయిన రోడ్డు పనులు: 9ప్రారంభించిన రోడ్డు పని: 1ప్రారంభించిన పని విలువ: ?2.00 లక్షలు

మొత్తం అభివృద్ధి పనులు: రూ79.00 లక్షలు

లిపాత 8వ వార్డు అభివృద్ధి పనుల విలు వ 14. 25 లక్షలు

సి సి రోడ్ల పనులు: 2

రోడ్ల పనుల విలువ: రూ9.00 లక్షలు

పూర్తయిన రోడ్డు పనులు: 2

ప్రారంభించిన రోడ్డు పని: 1

ప్రారంభించిన పని విలువ: రు5.25 లక్షలు

మొత్తం అభివృద్ధి పనుల విలువ: రు14,25,000

9వ వార్డుకు 38.63 లక్షల తో అభివృద్ధి

9వ వార్డు అభివృద్ధి పనుల వివరాలు:

రోడ్డు పనులు ప్రారంభం -- 1

రోడ్డు పనుల విలువ రు24.00 లక్షలు

పూర్తయిన డ్రెయినేజీ పనులు -- 2

డ్రెయినేజీ పనుల విలువ --రు14.63 లక్షలు



మొత్తం అభివృద్ధి పనుల విలువ రు38,63,000!

పాత10వ వార్డు అభివృద్ధికి13 లక్షలు

10వ వార్డు అభివృద్ధి పనుల వివరాలు:

పూర్తయిన డ్రెయినేజీ పని -- 1 విలువ -- ?8.00 లక్షలు

ప్రారంభించిన డ్రెయినేజీ పని -- 1

విలువ -- 5.00 లక్షలు

మొత్తం అభివృద్ధి పనుల విలువ 13,00,000!

ప్రతి వార్డుకు అభివృద్ధి ప్రతి వీధికి మౌలిక సదుపాయాలు

గిద్దలూరు మున్సిపాలిటీలో 11వ వార్డు లో మొత్తం అభివృద్ధి పనుల విలువ

రు26.80 లక్షలు సి సి డ్రెయినేజీ పనులు -- 3 డ్రెయినేజీ పనుల విలువ -- రు25 లక్షలు

సి సిరోడ్డు పని -- 1

రోడ్డు పని విలువ -- ?1.80 లక్షలు

ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మాటల్లో కాదు... అభివృద్ధి పనుల్లో చూపిస్తున్నాం అన్నారు.

13వ వార్డులో మొత్తం 23 లక్షల అభివృద్ధి పనులు!

సి సి రోడ్డు పనులు -- 1 పూర్తయిన పని విలువ -- రు13 లక్షలు

సి సిడ్రెయినేజీ పనులు -- 1 ప్రారంభించిన పని విలువ -- రు10 లక్షలు

మొత్తం అభివృద్ధి వ్యయం: రు23 లక్షలు!

గిద్దలూరు అభివృద్ధి లక్ష్యం 14వ వార్డులో మొత్తం 93.73 లక్షల అభివృద్ధి పనులు రోడ్ల నిర్మాణం. పూర్తయిన పనులు 11 మొత్తం విలువ: రు75.93 లక్షలు డ్రెయినేజీ నిర్మాణం పూర్తయిన పని: 1- మొత్తం విలువ: 17.80 లక్షలు మొత్తం 12 అభివృద్ధి పనులు -- రు93.73 లక్షలు ప్రతి వీధికి రోడ్లు... ప్రతి కాలనీకి మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం గిద్దలూరు మున్సిపాలిటీ 15వ వార్డులో రోడ్ల అభివృద్ధి: 2 పనులు -- రు11.95 లక్షలు మొత్తం: 2 పనులు -- రు11.95 లక్షలు. గిద్దలూరు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం, స్థానిక నాయకత్వం చేస్తున్న కృషిని ప్రతి వార్డులోనూ మాటల్లో కాకుండా చేతల్లో చేసి చూపిస్తున్నాం అన్నారు. అభివృద్ధి మాటల్లో కాకుండా లెక్కల్లో చూపించామని అశోక్ రెడ్డి తెలిపారు . చేసిన అభివృద్ధి ని చూసి కూటమి కి పట్టంకట్టాలన్నారు.

కూటమి విజయమే లక్ష్యంగా మంత్రి సుభాష్, ఎంపీ సానా సతీష్ విస్తృత ప్రచారం

ప్రచారం చివరి రోజు ఇంటింటికీ వెళ్లి కూటమి అభ్యర్థులకు ఓట్లు అభ్యర్థించిన మంత్రి, ఎంపీ మున్సిపల్‌లిచైర్మన్ అభ్యర్థి నల్లా శ్రీధర్ తో పాటు కూటమి అభ్యర్థులను గెలిపించండి



అమలాపురం, పెన్ పవర్ అక్టోబర్ 30

మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి ఆఖరి రోజు కావడంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ సానా సతీష్ అమలాపురం పట్టణంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుంటూ, కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో భాగంగా ల5, 12, 36, 35, 31వ వార్డుల్లో జనసేన పార్టీ అభ్యర్థుల తరఫునలి, ల27, 22, 29, 18, 19, 20, 16, 15వ వార్డుల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల తరఫునలి మంత్రి సుభాష్, ఎంపీ సానా సతీష్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను దృష్టిలో ఉంచుకొని ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమలాపురం పట్టణం మరింత అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్, అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి గంధం పల్లం రాజు, దొంగ శ్రీనుతో పాటు పెద్ద సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపిటిసి 2 అభ్యర్థి వరలక్ష్మి ప్రచారం

గుర్రంకొండ, పెన్ పవర్ అక్టోబర్ 30

గుర్రంకొండ ఎంపిటిసి 2అభ్యర్థి ఊటుకూరి వరలక్ష్మి ప్రచారంలో ముందడుగు లో ఉంది. తన వార్డు పరిధిలో ఉన్న ఓటర్లను స్వయంగా తాను కలిసి ఇంటింటికి తిరుగుతూ ప్రచారం కొనసాగిస్తున్నది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వం కాబట్టి ఆ పార్టీ తరపున ఎన్నికలలో పోటీచేస్తున్న తనను సైకిల్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను కోరుకొంటూ ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈమె మండల టిడిపి అధ్యక్షుడు నాయని జగదీష్ కుమార్ సతీమణి కావడం తనకు కలిసి వస్తోంది.



ప్రజా స్వామ్యాన్ని ఖునీ చేసిన కూటమి ప్రభుత్వం



పుల్లల చెరువు పెన్ పవర్ అక్టోబర్ 30

రాష్ట్రంలో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల లో కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖునీ చేసిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం. ఎల్. నారాయణ విమర్శించారు. జడ్పిటి సి సీపీఐ అభ్యర్థి గురునాధం విజయాన్ని కాంక్షిస్తూ సీపీఐ నాయకులు మండలంలో శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్థానిక ఎన్నికలలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని దౌర్జన్యం చేసిందన్నారు.ప్రతి పక్ష అభ్యర్థులు నామినేషన్ వేయకుండా కూటమి ప్రభుత్వం పోలీసుల తోకలిసి అడ్డుకుందని ఆయన ఆరోపించారు. కనిగిరి, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాలలో ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్ వేయకుండా అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. గత ప్రభుత్వం గొడ్డలిపార్టీ అని, తనకు 40సంవత్సరాల రాజకీయ అనుభవం అని, తానేదో రాష్ట్రన్ని ఉద్దరిస్తానని చెప్పిన చంద్రబాబు, రాష్ట్రాన్ని ఉద్దరించిందేమీ లేదని, స్థానిక ఎన్నికలలో దౌర్జన్యానికి ఉసిగోలిపి ప్రజాశ్వామ్యాన్ని అపహాస్యం చేశాడాన్నారు. పుల్లల చెరువుమండల జడ్పి టీసి పదవికి సీపీఐ అభ్యర్థిగా పోటీచేస్తున్న గురునాదం చిన్న నాటినుండే పార్టీ అభివృద్ధికి, మండలప్రజల సమస్యల పరిష్కారానికి చేసిన కృషి ప్రజలందరికి తెలుసునాన్నాడు గురునాదం ను గెలిపిస్తే ప్రజాసమస్యలకోసం తన వాణిని జడ్ పి సమావేశాల్లో వినిపించి పరిష్కారానికి కృషిచేస్తాడని ఆయన అన్నారు. కంకి కొడవలి గుర్తుపై ఓట్లేసి గురునాదం ను గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమం లో సీపీఐ కార్యవర్గ సభ్యులు కె. వి కృష్ణ గౌడ్, నియోజకవర్గ కార్యదర్శి బాణాల రామయ్య,ఏఐ టి యు సి నాయకులు డి మల్లిఖార్జునరావు, జిల్లా గిరిజన సమాఖ్య అధ్యక్షులు దేవసోత్ మంత్రు నాయక్, దోర్నాల మండల కార్యదర్శి విశ్వారుపాచారి, ప్రజానాట్యమండలి అధ్యక్షులు జీ శ్రీనివాశాచారి,కనకా చారి,జడ్పిటిసి అభ్యర్థి గోపవరపు గురునాదం పాల్గొన్నారు.

చేయి చేయి కలిపారు రహదారి గోతులు పూడ్చారు

తుఫాన్‌తో రహదారి కోత. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు

ఐదేళ్లుగా పూర్తికాని రహదారి పనులు

అధికారులు స్పందించాలని గ్రామస్తుల వేడుకోలు



హుకుంపేట పెన్ పవర్ అక్టోబర్ 30 :హుకుంపేట మండలంలోని పట్టాం పంచాయతీ కోడితల గ్రామంలో ఆర్నబ్ తుఫాన్ కారణంగా రహదారి కోతకు గురై రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో ఎవరో వస్తారు.ఏదో చేస్తారని ఎదురుచూడకుండా గ్రామస్తులే చైతన్యంతో ముందుకొచ్చారు. సమష్టిగా శ్రమదానం చేసి రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్చి తాత్కాలికంగా రాకపోకలకు అనువుగా మార్చుకున్నారు.తుఫాన్ సమయంలో కురిసిన వర్షాలకు మట్టి రహదారి పలుచోట్ల కొట్టుకుపోయి భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో గ్రామస్తులు నడిచి వెళ్లేందుకు, వాహనాలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మరింత అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.గ్రామానికి గతంలో రహదారి మంజూరైనప్పటికీ పనులు మట్టి రోడ్డు వరకే పరిమితమయ్యాయని గ్రామస్తులు తెలిపారు. సుమారు ఐదేళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో రహదారి నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో ప్రతి వర్షాకాలంలో మట్టి కొట్టుకుపోయి గోతులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. దీంతో ఏటా రహదారి కష్టాలు తప్పడం లేదన్నారు.ప్రభుత్వాలు మారుతున్నా గిరిజన గ్రామాల రహదారి సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యాలు కల్పిస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నప్పటికీ మారుమూల గ్రామాల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు.ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కోడితల గ్రామానికి పూర్తిస్థాయి రహదారి సౌకర్యం కల్పించి తమ కష్టాలు తీర్చాలని గ్రామ పెద్దలు సతీష్, శ్రీను, ప్రసాద్, కామేశ్వరరావు, చిన్నయ్య, బాబురావు, చిట్టిబాబు, భాస్కరరావు, లక్ష్మణ్, సత్యారావు, కొండలరావు, కృష్ణ తదితరులు కోరారు.

శివాలయం రోడ్డులో పింఛన్లు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ నిశాంతి టి.



పాడేరు పెన్ పవర్:అక్టోబర్ 30 :అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ నిశాంతి టి. ఈరోజు పాడేరు పట్టణంలోని శివాలయం రోడ్డులో లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పింఛన్లను అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందజేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.

కూటమి అభ్యర్థులకు మద్దతుగా గొర్లె వీర వెంకట్ ప్రచారం

- మండల అభివృద్ధికి కూటమి అభ్యర్థులకు సహకరించాలని పిలుపు



గూడెంకొత్తవీధి, పెన్ పవర్,అక్టోబర్ 30:గూడెంకొత్తవీధి మండల కేంద్రంలో కూటమి ఎన్నికల ప్రచారం కొనసాగింది. ఈ ప్రచార కార్యక్రమంలో జనసేన పార్టీ పాడేరు నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త గొర్లె వీర వెంకట్ పాల్గొని కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామాల అభివృద్ధితోనే మండలం అభివృద్ధి చెందుతుందని పేర్కొంటూ, రానున్న ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి మండల అభివృద్ధికి సహకరించాలని ప్రజలను కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు అభివృద్ధి అంశాలను వివరించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, ఎంపీటీసీ అభ్యర్థి పసుపులేటి చైతన్య వర్మ, కూటమి నాయకులు గడుతూరి పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరురా.ప్రచారాల మైకులు.

పలు గ్రామాల్లో ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే శెట్టి.



హుకుంపేట పెన్ పవర్ అక్టోబర్ 30 : అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలంలో పలు సెగ్మెంట్లలో ఎంపీటీసీ మరియు జడ్పిటిసి ఎన్నికల నిమిత్తం మాజీ ఎమ్మెల్యే శెట్టి పాల్గొన్న పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను ఎంతగానో ఆదరించి అభిమానించిన ప్రజలకు. కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అంటూ అలాగే ఈరోజు వైఎస్ఆర్సిపి నుండి నిలబడిన ప్రతి సెగ్మెంట్లో ఎంపీటీసీ లను ప్రజలు ఆదరించాలని గెలిపించాలని అలాగే జడ్పిటిసిగా ఒంటోబు ప్రియాంకను గెలిపించాలంటూ ఆయన ప్రచారాన్ని హోరత్తించారు

ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ తేడాబారికి సురేష్ మాజీ జడ్పిటిసి కొర్ర కాసులమ్మ హుకుంపేట మాజీ సర్పంచ్ సమ్మెడ వెంకట పూర్ణిమ మరియు వైసిపి హుకుంపేట మండల అధ్యక్షుడు పాంగి అనిల్ పాతకోట సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుడు పాడి సత్య రావు దుర్గం సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యుడు పూజారి తమ్మన్న మరియు వైసీపీ శ్రేణులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ప్రచారంలో విస్తృతంగా పర్యటిస్తున్న పూజారి లీలా ప్రసాద్

జీకే వీధి-1 సెగ్మెంట్‌లో గ్రామగ్రామాన ఓటర్లను కలుస్తూ మద్దతు కోరుతున్న అభ్యర్థి



గూడెంకొత్తవీధి, పెన్ పవర్,అక్టోబర్ 30:అల్లూరి సీతారామరాజు జిల్లా, గూడెంకొత్తవీధి మండలం జీకే వీధి-1 సెగ్మెంట్ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ అభ్యర్థి పూజారి లీలా ప్రసాద్ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. సెగ్మెంట్ పరిధిలోని వివిధ గ్రామాల్లో పర్యటిస్తూ ఓటర్లను నేరుగా కలుసుకుని తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను ఎంపీటీసీగా గెలిపిస్తే జీకే వీధి సెగ్మెంట్ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఓటర్లకు హామీ ఇస్తున్నారు. గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని వివరిస్తూ మద్దతు కోరుతున్నారు.ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు వంతల అరుణ్ కుమార్‌తో పాటు పలువురు యువకులు పాల్గొంటూ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

వనరులున్నా వెనుకబాటే.. గూడెంకొత్తవీధి అభివృద్ధే నా లక్ష్యం



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 30:జడ్పీటీసీ ఎన్నికల్లో విజయం సాధిస్తే గూడెంకొత్తవీధి మండల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ కృషి చేస్తానని జడ్పీటీసీ స్వతంత్ర అభ్యర్థి కంకిపాటి మోహన్‌రావు పడాల్ అన్నారు. మండలంలోని పెదవలస సంతలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.జిల్లాలోని ఇతర మండలాలతో పోలిస్తే గూడెంకొత్తవీధి మండలం అభివృద్ధిలో వెనుకబడి ఉందని ఆయన పేర్కొన్నారు. బ్రిటిష్ పాలన కాలంలోనే గూడెం ముఠాగా గుర్తింపు పొందిందని, అనంతరం 1955లో గూడెం నియోజకవర్గంగా, 1965లో చింతపల్లి నియోజకవర్గంగా, 2009లో పాడేరు నియోజకవర్గంగా మారిన చారిత్రక నేపథ్యాన్ని వివరించారు.1975లో రింతాడలో ఏర్పాటు చేయాల్సిన ఐటీడీఏను పాడేరుకు తరలించారని ఆయన పేర్కొన్నారు. మండలంలో అత్యధికంగా కాఫీ సాగు జరుగుతున్నప్పటికీ అరకు కాఫీ పేరుతో గుర్తింపు పొందుతోందని, సీలేరు ప్రాజెక్టు ద్వారా విద్యుత్ ఉత్పత్తి, పర్యాటక అభివృద్ధికి కూడా అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇన్ని వనరులు, అవకాశాలు ఉన్నప్పటికీ మండలం ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదని అభిప్రాయపడ్డారు.జడ్పీటీసీగా తనను గెలిపిస్తే మండలంలోని గ్రామాల సమస్యలను గుర్తించి, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాల కోసం కృషి చేస్తానని కంకిపాటి మోహన్‌రావు పడాల్ ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు, కంకిపాటి శరభన్న పడాల్, చిరంజీవి, బుజ్జిపడాల్‌తో పాటు పలువురు యువకులు, మహిళలు పాల్గొన్నారు.

కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయంలో ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ



స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్ విజయనగరం, అక్టోబర్ 30: భారతదేశ ఉక్కు మనిషి, స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ 151వ జయంతిని పురస్కరించుకుని కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్‌లో జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయంలో జాతీయ ఐక్యతా దినోత్సవ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఇన్‌ఛార్జి ఉపకులపతి ప్రొ.టి. శ్రీనివాసన్ మాట్లాడుతూ, దేశ ఐక్యత, సమగ్రత, సార్వభౌమత్వాన్ని కాపాడటంలో ప్రతి పౌరుడికి బాధ్యత ఉందని, భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ ప్రత్యేకత అని పేర్కొన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ దేశంలోని సంస్థానాలను ఏకీకృతం చేసి జాతీయ సమైక్యతకు బలమైన పునాది వేశారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.రిజిస్ట్రార్ ఇన్‌ఛార్జి ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా మాట్లాడుతూ, జాతీయ ఐక్యత అనేది కేవలం ఒకరోజు నిర్వహించే కార్యక్రమానికి పరిమితం కాకుండా ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని పేర్కొన్నారు. కుల, మత, భాష, ప్రాంతీయ భేదాలకు అతీతంగా పరస్పర గౌరవం, సోదరభావం, ఐక్యతతో ముందుకు సాగినప్పుడే బలమైన దేశ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.గ్రంథాలయాధికారి డా. శంకర్ రెడ్డి కొల్లే ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి డా. సురేష్ బాబు కలిదిండి, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డా. బొంతు కోటయ్య, ఓఎస్‌డీలు డా. తారకేశ్వరరావు, డా. లతా కల్యశీపూడి, డా. పి. శ్రీదేవి, డా. అప్పాసాబా, డా. ఎన్.వి.ఎస్. సూర్యనారాయణ, డా. దివ్య, డా. ప్రమ, డా. కుసుమ, డా. గంగు నాయుడు, డా. నాగేష్, డా. ప్రసాద్, డా. కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచార వాహన అనుమతులకు ఈ పత్రాలు తప్పనిసరి!

ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు తహసీల్దార్ అన్నాజీ రావు సూచన

గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 30:మండలంలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులకు ఎన్నికల ప్రచార వాహన అనుమతుల జారీ ప్రక్రియ ప్రారంభించినట్లు జీకేవీధి తహసీల్దార్ హెచ్. అన్నాజీ రావు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యాలయ పని వేళల్లో ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా అనుమతులు జారీ చేయనున్నట్లు వెల్లడించారు.వాహన అనుమతుల కోసం అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, వాహన రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ (ఆర్సీ), ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, వాహనం ఫొటో, డ్రైవర్ డ్రైవింగ్ లైసెన్స్, ఆధార్ కార్డు సమర్పించాలని సూచించారు. అన్ని ఒరిజినల్ పత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను తప్పనిసరిగా అందజేయాలని పేర్కొన్నారు.సమర్పించిన పత్రాలను పరిశీలించిన అనంతరం ఎన్నికల నిబంధనల ప్రకారం వాహన అనుమతులు జారీ చేస్తామని తహసీల్దార్ స్పష్టం చేశారు.



సిపిఎం పార్టీని గెలిపిస్తే హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిలుపుదలపై. పోరాటం కొనసాగిస్తాం !

సిపిఎం పార్టీ జిల్లా నాయకురాలు ఎస్. హైమావతి.



హుకుంపేట అక్టోబర్ 30 పెన్ పవర్. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలంలోని పట్టాం, బూర్జ పంచాయతీల పరిధిలోని సులిపాకన్, డి.సల్తంగి, సొంటరిపాడు, ఎగసల్తంగి తదితర గ్రామాల్లో సీపీఎం ఎంపీటీసీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం జోరందుకుంది.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా నాయకురాలు హైమావతి మాట్లాడుతూ నిత్యం ప్రజల పక్షాన నిలబడి సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న సీపీఎం అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. సీపీఎం అభ్యర్థులను గెలిపిస్తే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను మండల పరిషత్‌లో ప్రస్తావించి వాటి పరిష్కారానికి పోరాడే అవకాశం ఉంటుందని తెలిపారు.బూర్జ సెగ్మెంట్ నుంచి సీపీఎం ఎంపీటీసీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొర్రా అరుణకు ప్రజలు తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.గిరిజన ప్రాంతాలకు నష్టం కలిగించే హైడ్రో పవర్ ప్రాజెక్టును సంబంధించిన జీవోలను రద్దు చేయాలని సీపీఎం నిరంతరం పోరాటం చేస్తోందన్నారు. గిరిజనుల భూములు, హక్కులు, సహజ పసరుల పరిరక్షణకు సీపీఎం ముందుండి పోరాడుతుందని హైమావతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి అభ్యర్థి కొర్రా. అరుణ, నాయకులు ఆనంద్, గ్రామ పెద్దలు యోహన్,గుండన్నా,అర్జున్,సుబ్బారావు, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలి

- పెదవలస, రింతాడలో వైఎస్సార్‌సీపీ ఎన్నికల ప్రచారం
- ఎంపీ గుమ్మా తనూజారాణి, మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పిలుపు



గూడెంకొత్తవీధి, పెన్ పవర్, అక్టోబర్ 30:గూడెంకొత్తవీధి మండలంలోని పెదవలస, రింతాడ పంచాయతీల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థుల తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అరకు పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ గుమ్మా తనూజారాణి, పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి పాల్గొని పార్టీ నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.రింతాడలో జీకే వీధి జడ్పీటీసీ అభ్యర్థి కంకిపాటి గిరిప్రసాద్‌తో పాటు రింతాడ-1, రింతాడ-2 ఎంపీటీసీ అభ్యర్థుల తరఫున నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన జడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని, 2029 సార్వత్రిక ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని ఇప్పటి నుంచే కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ బోయిన కుమారి, జిల్లా కోశాధికారి కుందేరి రామకృష్ణ, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు కంకిపాటి రామారావు, యువత అధ్యక్షుడు లమ్మసింగి రమేష్, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, పెదవలస పంచాయతీ అధ్యక్షుడు కంకిపాటి శ్రీరాములు, లక్ష్మీపురపుపేట అధ్యక్షుడు బురిడీ గంగాధర్, సీనియర్ నాయకులు పిండి రామకృష్ణ, వంతల అప్పారావు, వంతల నారాయణ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొన్నారు.

మేము కూడా అంతే ఆర్గానిక్ ఎలక్షన్స్ కు వెళుతున్నాం!



మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల రాజకీయాన్ని ఆర్గానిక్ వ్యవసాయంతో పోల్చిన ఆయన గుంటూరు మేయరు అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాడికొండ శ్రీదేవి తరఫున తమ పార్టీ మద్యం, డబ్బు పంచమని, గెలిపిస్తే మంచి పాలన అందిస్తామని వ్యాఖ్యానించారు. తాము నగరంలో ఆర్గానిక్ ఎలక్షన్స్ చేస్తామని అంబటి వ్యాఖ్యానించారు. "ఆర్గానిక్ వ్యవసాయం తెలుసు కదా' మందులు వేయరు, ఎరువులు వేయరు. కానీ, పంట చాలా రుచిగా ఉంటుంది. మేము కూడా అంతే ఆర్గానిక్ ఎలక్షన్స్ కు వెళుతున్నాం, మందులు, ఎరువులు వేయం" అంటూ చెప్పారు. పరోక్షంగా తాము ఎన్నికల్లో డబ్బు ఖర్చు చేయమని, మద్యం సరఫరా చేయమని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో తాము ఘోరంగా ఓడిపోయామని వ్యాఖ్యానించిన అంబటి తమ పార్టీ తరఫున ఎన్నికల్లో ఎటువంటి ఖర్చు చేయమని విస్పష్టంగా ప్రకటించడం హాట్ టాపిక్ అవుతోంది. విపక్షం వైసీపీలో మంచి మాటకారిగా అంబటి రాంబాబుకు పేరుంది. ముఖ్యంగా అధికార కూటమి పాలనను తనదైన శైలిలో విమర్శిస్తూ నిత్యం మీడియాను ఆకర్షిస్తుంటారు అంబటి. రెండు రోజుల క్రితం రాష్ట్రంలో ధరల పెరుగుదలను ఎండగడుతూ 'బియ్యం కిలో వంద రూపాయలు అయినందుకు చంద్రబాబు, లోకేశ్ కు ట్యాంక్స్' అంటూ ట్వీట్ చేసి అధికార పక్షంపై వ్యంగ్యాస్త్రాన్ని సంధించారు. ఒక్క మాటతో తమ అజెండాను వివరించిన అంబటి, ప్రజలు నిత్య జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యను హైలెట్ చేశారని అంటున్నారు. ఇక తాజాగా తమ పార్టీ పరిస్థితిని వివరిస్తూ ఆర్గానిక్ ఫార్మింగ్ ను ఉదహరించడంపై నెట్టింట ఆసక్తికర చర్చ జరుగుతోంది.

ఆర్గానిక్ ఫార్మింగ్ కు ఆదరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తమ పార్టీ కూడా ఆర్గానిక్ ఎన్నికలకు వెళుతున్నట్లు అంబటి చెప్పడం ఆకర్షించిందని అంటున్నారు. ఓడిపోయిన తమ వద్ద డబ్బు లేదని చెప్పడంతోపాటు తమ పార్టీ తరఫున నిలిపిన అభ్యర్థి సైతం పేద ఆర్యవైశ్య కులానికి చెందిన వారంటూ చెప్పి ఆ వర్గాన్ని ఆకట్టుకునే ప్రయత్నం చేశారని అంటున్నారు. ఇదే సమయంలో ఆర్యవైశ్య సామాజికవర్గానికి చెందిన ప్రముఖలు తమ అభ్యర్థి తాడికొండ శ్రీదేవికి పార్టీలకు అతీతంగా ఓటు వేయాలని, ప్రతి ఒక్కరూ రూపాయి చొప్పున సాయం చేయాలని కోరారు. నోటు ఇవ్వాలి.. ఓటు వేయాలి అంటూ ఆయన ఆర్యవైశ్యులకు పిలుపునిచ్చారు.టీడీపీ అభ్యర్థి ఆర్థికంగా ఉన్నవారని, వారిని డబ్బుతో ఢీకొట్టలేమని అంబటి పరోక్షంగా అంగీకరించారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.డబ్బు ఖర్చు చేయనిదే ఎన్నికల్లో పాల్గొనలేని నేటి పరిస్థితుల్లో అంబటి చేసిన తాజా వ్యాఖ్యలు హాట్ టాపిక్ అవుతున్నాయి. ప్రధానంగా ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి నుంచి ఎలాంటి తాయిళాలు ఆశించవద్దని పార్టీ కేడర్ తోపాటు ఓటర్లకు మాజీ మంత్రి అంబటి సంకేతాలిచ్చారని విశ్లేషిస్తున్నారు. ప్రస్తుత మున్సిపల్ ఎన్నికల్లో అధికార కూటమి, వైసీపీ మధ్య పోటీపై రకరకాల విశ్లేషణలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా అధికారపక్షం తీరుపై విపక్షం ఘాటు విమర్శలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి అంబటి ఓటర్లను ఆలోచనలకు గురిచేసేలా మాటలతో మాయ చేస్తున్నారని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

పోలింగ్ కి కౌంట్ డౌన్ : జనం నాడి చిక్కుతుందా ?



విజయవాడ: పెన్ పవర్:ఏపీలో దాదాపుగా 30 నెలల తరువాత జనాలు ఓటు వేయబోతున్నారు. అయిదు విడతలుగా స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో తొలి విడతకు నవంబర్ 1న తెర లేవనుంది. మొదటి విడతలో అర్బన్ బాడీస్ కి ఎన్నికలు జరుగుతున్నాయి. 87 మునిసిపాలిటీస్, 13 కార్పోరేషన్లు మొత్తంగా 100 చోట్ల ఎన్నికలు నిర్వహిస్తున్నారు. నవంబర్ 1వ తేదీ ఏపీలో ఒక బిగ్ జడ్జిమెంట్ డే గా ఉండబోతోంది. ఏపీలో 2024 మే 13న సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. 25 ఎంపీ, 175 ఎమ్మెల్యే సీట్లకు ఒకేసారి నిర్వహించిన ఈ ఎన్నికల ఫలితాలు జూన్ 4న విడుదల అయ్యాయి. ఆ ఎన్నికల్లో టీడీపీ కూటమి 95 సీట్ల షేర్ తో భారీ విజయాన్ని నమోదు చేసింది.

ప్రాధాన్యత అందుకే :

నామమాత్రంగా వైసీపీ మిగిలింది. ఇక కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయి రెండున్నరేళ్ళ తరువాత స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ మధ్యలో ప్రజల ఆలోచనలు ఎలా ఉన్నాయి, ప్రభుత్వ విధానాల మీద ప్రజలు ఏమనుకుంటున్నారు కూటమి పాలన సంతృప్తిని ఇచ్చిందా లేదా అన్నది ఎంతో కొంత స్థానిక సంస్థల ఎన్నికల రూపంలో తెలుస్తుందా అన్నది అయితే చర్చగా ఉంది. ఎందుకంటే ఈ మధ్యలో మరే ఎన్నిక కానీ ఏ రకమైన తీర్పు కానీ జనం వైపు నుంచి రాలేదు, దాంతో స్థానిక సంస్థల ఎన్నికలకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. దాంతో స్థానిక సంస్థల ఎన్నికలను అటు అధికార కూటమి ఇటు విపక్ష వైసీపీ కూడా చాలా సీరియస్ గానే తీసుకున్నాయి. దాంతో నామినేషన్ల పర్వం నుంచే ఘర్షణ వాతావరణం ఏర్పడింది అని గుర్తు చేస్తున్నారు.

సహజంగా చూస్తే :

ఇక స్థానిక సంస్థల ఎన్నికల తీరు చూస్తే సహజంగా అధికారంలో ఎవరు ఉంటారో వారి వైపే జనం తీర్పు ఉంటుంది. ఎందుకంటే ప్రభుత్వంలో ఉన్న పార్టీలకు ఓటు చేస్తే తమకు మేలు జరుగుతుందని, స్థానికంగా తమ ప్రాంతాలలో అభివృద్ధి జరుగుతుందని భావిస్తారు. అంతే కాదు ప్రభుత్వంతో కలసి నడవాలని మెజారిటీ జనాలు అనుకుంటారు. దాంతో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాల మీద పెద్దగా అంచనాలు అయితే రాజకీయంగా లేకపోయినా కొన్ని చోట్ల నుంచి వచ్చే విలక్షణ తీర్పులు మాత్రం ప్రత్యేకం అవుతాయి. వాటినే పట్టుకుని నిశితంగా పరిశీలన చేయడం జరుగుతుంది.

ఏకమొత్తంగా అంటూ :

ఇక ఏకమొత్తంగా నూరు శాతం స్ట్రైక్ రేట్ ని కూటమి పార్టీలు సాధించాలని ఆ వైపు నుంచి ఘనమైన నినాదం వినిపిస్తోంది. 2024లో వచ్చిన రిజల్ట్ నే రిపీట్ చేయాలని కూడా కూటమి పార్టీలు కోరుకుంటున్నాయి. అదే సమయంలో రెండున్నరేళ్ల పాలన అంటే సగం పూర్తి అయినట్లే. దాంతో ఎక్కడో ఒక చోట అసంతృప్తి ఉంటుంది అని దానిని వెలికి తీస్తే తమకు 2029 ఎన్నికలకు దారి దొరికినట్లే అని విపక్ష వైసీపీ భావిస్తోంది. అందుకే ఈసారి స్థానిక ఎన్నికల్లో గట్టిగా తేల్చుకోవాలని వైసీపీ భావిస్తోంది. మొత్తం ఫలితాలు ఒక్కలా ఉండవని ఎంతో కొంత తేడా కనిపించినా అది తన విజయంగా భావించాలని దానినే పెద్దది చేసి చూపించాలని తద్వారా ప్రజల నాడిని పట్టుకుని ఇదే రేపటి సార్వత్రిక ఎన్నికల్లో తీర్పుగా మార్పుగా చూడాలని వైసీపీ భావిస్తుంది అన్నది కూడా ఉంది.

మంచిదే కదా :

అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏ మాత్రం ప్రతికూలత ఎక్కడ వచ్చినా దానిని సరిదిద్దుకునే చాన్స్ అధికార కూటమికి కచ్చితంగా ఉంటుంది. చేతిలో ఇంకా సగం పాలన ఉంటుంది కాబట్టి ఆ విధంగా చక్కబెట్టుకుని 2029 నాటికి గట్టిగా జనం వద్దకు వెళ్ళవచ్చు. అలా జనం ఏమనుకుంటున్నారు అన్నది తెలియడం అధికారంలో ఉన్న వారికే అవసరం అని అంటున్నారు. మరి అలా జరుగుతుందా జనం ఎక్కడైనా తమ భావనలు బయట పెడతారా లేదా గుంభనంగా ఉంటూ అధికార కూటమికే జై కొడతారా అన్నదే చూడాల్సి ఉంది. మొత్తం మీద చూస్తే కనుక లోకల్ బాడీస్ లో ఎంతో కొంత జనం నాడి పట్టడానికి పార్టీలే కాదు రాజకీయ విశ్లేషకులు కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరి అలా జరుగుతుందా లేదా అన్నదే ఇంట్రెస్టింగ్ మ్యాటర్.

పనబాక కుమార్తెకు కీలక పదవి.. టీడీపీ అధిష్టానం సంకేతాలు



విజయవాడ: పెన్ పవర్:తిరుపతి జిల్లా పరిషత్ మొదటి ఛైర్‌పర్సన్‌గా కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి కుమార్తె డాక్టర్ పనబాక చేతన పేరు పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఎస్సీ మహిళకు రిజర్వు అయిన తిరుపతి జడ్పీ ఛైర్‌పర్సన్ పదవిని చేతనతోపాటు మాజీ ఎమ్మెల్యే హేమలత ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అయితే యవత, విద్యావంతురాలు అన్న ఆలోచనతో అధిష్టానం డాక్టర్ చేతన పేరుపై మొగ్గు చూపుతోందని టాక్ నడుస్తోంది. ఇప్పటికే డాక్టర్ చేతన పేరును ఖరారు చేసిందని, అధికారిక ప్రకటన ఒక్కటే విడుదల చేయాల్సివుందని అంటున్నారు. సీనియర్ నాయకురాలు పనబాక లక్ష్మి సేవలు, సుదీర్ఘ రాజకీయ అనుభవానికి తగిన న్యాయం చేయాలనే ఆలోచనతో టీడీపీ అధిష్టానం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

తొలి ఛైర్‌పర్సన్‌గా చేతన

తిరుపతి జిల్లా కొత్తగా ఏర్పడిన తర్వాత జిల్లా పరిషత్‌కు జరుగుతున్న తొలి ఎన్నికలు ఇవి. నెల్లూరు జిల్లాలోని సూళ్లూరుపేట, వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గాలు తిరుపతి జిల్లా పరిధిలోకి చేరడంతో జడ్పీ పరిధి కూడా విస్తరించింది. ఈ నూతన జిల్లా పరిషత్‌కు తొలి ఛైర్‌పర్సన్‌గా విద్యావంతురాలు, యువ నాయకురాలు డాక్టర్ పనబాక చేతన పేరును అధిష్టానం ఖరారు చేసేందన్న ప్రచారం ఆసక్తి రేపుతోంది. శ్రీకాళహస్తి రూరల్ జడ్పీటీసీ సభ్యురాలిగా చేతన ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజకీయంలోకి కొత్తగా అడుగుపెట్టినప్పటికీ, మొదటి ప్రయత్నంలోనే జడ్పీటీసీగా ఏకగ్రీవంగా గెలుపొంది తన సత్తా చాటారు. ఇప్పుడు అధిష్టానం అవకాశం ఇస్తే, తిరుపతి జిల్లా పరిషత్‌కు మొట్టమొదటి జడ్పీ ఛైర్‌పర్సన్గా చరిత్రకెక్కే అవకాశముందని అంటున్నారు.

పనబాక లక్ష్మి సీనియార్టీకి గుర్తింపు

కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి 2014 సార్వత్రిక ఎన్నికల అనంతరం టీడీపీలో చేరారు. 2019 సాధారణ ఎన్నికలతో పాటు, ఆ తర్వాత జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలోనూ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేశారు. పార్టీ పట్ల ఆమె చూపిన నిబద్ధత, సీనియార్టీని గుర్తించిన అధిష్టానం ఆమెకు టిటిడి బోర్డు సభ్యురాలిగా అవకాశం కల్పించింది. అయినప్పటికీ, ఆమె ఉన్నత స్థాయి రాజకీయ అనుభవానికి తగినంత గుర్తింపు ఇంకా దక్కలేదన్న అభిప్రాయం పార్టీ శ్రేణుల్లో ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలోనే పనబాక లక్ష్మి కుమార్తె చేతనకు జిల్లా స్థాయిలో అత్యున్నతమైన జడ్పీ ఛైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టడం ద్వారా పనబాక కుటుంబానికి తగిన ప్రాధాన్యం ఇచ్చామని స్పష్టం చేయాలని టీడీపీ యోచిస్తోందని అంటున్నారు.

ఉన్నత విద్యావంతురాలు

డాక్టర్ పనబాక చేతన డెర్మటాలజీ (చర్మ వైద్యం)లో ఎండి చేసిన ఉన్నత విద్యావంతురాలు. కేంద్ర మంత్రిగా పనిచేసినా ఎప్పుడూ వినయం, సౌశీల్యం, మృదుభాషణ విడవని పనబాక లక్ష్మి పెంపకంలో పెరిగిన చేతన, అదే సంస్కారాన్ని పుణికిపుచ్చుకున్నారని ప్రశంసలు అందుకుంటున్నారు. రాజకీయంగా ప్రత్యర్థులు కూడా గౌరవించే వ్యక్తిత్వం పనబాక లక్ష్మి సొంతమని, అటువంటి విలువలున్న కుటుంబం నుంచి వచ్చిన చేతన టీడీపీకి అత్యంత గౌరవప్రదమైన అభ్యర్థి అవుతారనడంలో సందేహం లేదని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. గతంలో పనబాక లక్ష్మి తిరుపతి లోక్‌సభకు పోటీ చేసిన సమయంలో చేతన విస్తృత ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ స్వల్ప రాజకీయ అనుభవంతో ఏకంగా జడ్పీ ఛైర్‌పర్సన్ పీఠం దక్కించుకుంటున్నారని వ్యాఖ్యానిస్తున్నారు.

నిజాయతీపరుడైన అధికారిని కోల్పోయాం..

విజయవాడ: రిటైర్డ్ డీజీపీ ఎన్. బాలసుబ్రహ్మణ్యం అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు మరియు మంత్రి నారా లోకేశ్ తీవ్ర సంతాపంవ్యక్తం చేశారు. బాలసుబ్రహ్మణ్యం నిజాయతీకి, నిబద్ధతకు మారుపేరని, ఆయన మరణం తనను తీవ్ర విచారానికి గురిచేసిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ..

"బాలసుబ్రహ్మణ్యం గారు నిజాయతీ విషయంలో ఎన్నడూ రాజీపడని అధికారి. దృఢమైన నిర్ణయాలు, ప్రగతిశీల ఆలోచనలతో ఆయన ఎంతో గౌరవం సంపాదించుకున్నారు. పోలీసింగ్, ఇంటెలిజెన్స్, రవాణా, ప్రభుత్వ పాలన వంటి వివిధ శాఖల్లో తనదైన ముద్ర వేశారు. సంస్కరణలు, నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని ఆయన నిరంతరం ప్రోత్సహించేవారు. కొన్ని నెలల క్రితం వరకు కూడా ఆంధ్రప్రదేశ్‌కు ఆయన తన అనుభవంతో విశేష సేవలు అందించారు. అనారోగ్యంతో పోరాడుతున్న సమయంలోనూ అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు. ఆయన మరణం రాష్ట్రానికి తీరని లోటు" అనివ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. నారా లోకేశ్ కూడా బాలసుబ్రహ్మణ్యం మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. రిటైర్డ్ ఐపీఎస్ అధికారి, ఏపీఎస్ఆర్టీసీమాజీ వైస్ చైర్మన్ అండ్ ఎండీ బాలసుబ్రహ్మణ్యం అమెరికాలో చికిత్స పొందుతూ కన్నుమూశారని తెలిసి తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానని పేర్కొన్నారు. "నిజాయతీ, అంకితభావంతో విధులు నిర్వర్తించిముక్కుసూటి మనిషిగా పేరుపొందిన బాలసుబ్రహ్మణ్యం గారి సేవలు చిరస్మరణీయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. పరిపాలనానైపుణ్యం, ఆధునిక పోలీసింగ్‌కు ఆయన ఒక మూలస్తంభం వంటి వారు. ప్రజా సేవలో ఆయన చూపిన అంకితభావం, ధైర్యం ఎప్పటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి" అని లోకేశ్ నివాళులర్పించారు.

విశాఖ విజయవాడ.... హీటెక్కించే రిజల్ట్స్ !



ఏపీలో మొత్తం 13 కార్పోరేషన్లకు నవంబర్ 1న పోలింగ్ జరగబోతోంది. అందులో ఉత్తరాంధ్రా గోదావరి కోస్తా రాయలసీమ జిల్లాలలో కార్పొరేషన్లు ఉన్నాయి. అయితే అందరి దృష్టిని ఆకట్టుకుంటున్నవి రెండే కార్పోరేషన్లు అని అంటున్నారు. దానికి కారణాలు అనేకం ఉన్నాయి. ఏపీలో అతి పెద్ద కార్పొరేషన్ గా విశాఖ ఉంది. 120 వార్డులు అంటే ఏపీలో మరెక్కడా లేవు. అలాగే టాప్ టెన్ కార్పోరేషన్లలో దేశంలో ఒకటిగా జీవీఎంసీ ఉంది. ఆదాయంలో అభివృద్ధిలో అలాగే ఏపీలో మెగా సిటీగా విశాఖ ఉంది. విశాఖ మీద ఏ ప్రభుత్వం ఉన్నా ప్రత్యేక ఫోకస్ పెడుతుంది. దాంతో విశాఖను గెలుచుకోవాలని పట్టుదలతో రాజకీయ పక్షాలు చూస్తాయి. ఇక తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే విశాఖ ఒక సెంటిమెంట్ గా ఉంది. 1987లో తొలిసారి ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరిగినపుడు టీడీపీ మేయర్ సీటుని గెలుచుకుంది. అది జరిగిన తరువాత దాదాపు నాలుగు దశాబ్దాల టీడీపీ విశాఖ మేయర్ పీఠం కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. అందుకే ఈసారి కూటమి పార్టీలు కోరినా ఇవ్వకుండా తానే పోటీ పడుతోంది.

ఎపుడూ భిన్నంగానే :

విశాఖ ఓటర్లు ఎప్పుడూ భిన్నంగా తీర్పు ఇస్తారు. వారు అభివృద్ధిని కోరుకుంటారు. దానితో పాటు ప్రశాంతత ఈ ప్రాంతం స్పెషాలిటీ. అందుకే రాజకీయ పక్షాలు కూడా ఇక్కడ సాఫీగానే ప్రచారం చేస్తూ వస్తాయి. టీడీపీ కూటమికి అయితే తమకు మేయర్ పీఠం కచ్చితంగా దక్కుతుందని నమ్మకం ఉంది. పైగా జీవీఎంసీ పరిధిలో ఎమ్మెల్యేలు, ఎంపీలు అంతా కూటమికి చెందిన వారే. దాంతో గెలుపు నల్లేరు మీద నడక అని భావిస్తున్నా ఎక్కడా తగ్గడం లేదు, ఎందుకంటే ప్రజా క్షేత్రంలో పోరు ఎప్పటికప్పుడు వైరైటీగానే ఉంటుంది. పైగా 18 లక్షల ఓటర్లు ఓటు వేయబోతున్నారు. 2024 తరువాత కొత్త ఓటర్లు, జెన్ జీలు ఉన్నారు.

వైసీపీ గట్టిగానే :

వైసీపీ కూడా విశాఖ మేయర్ సీటు విషయంలో గట్టిగానే పోటీ పడుతోంది. తమకు బలం ఉందని నిరూపించుకునే ప్రయత్నం చేస్తోంది. అభ్యర్థి విషయంలో వైసీపీ సక్సెస్ అయింది. ఎమ్మెల్సీగా ఉన్న వరుదు కళ్యాణిని నిలబెట్టి జనానికి పరిచయం ఉన్న బీసీ మహిళతో రాజకీయంగా ముందుకు సాగుతోంది. ప్రధానంగా కూటమి ప్రభుత్వం మీద వచ్చే యాంటీ ఇంకెంబెన్సీ మీదనే వైసీపీ ఆశలు పెట్టుకుంది. అలాగే కూటమిలో లుకలుకలు ఉంటే అవి తమకు ఎంతో కొంత అనుకూలిస్తాయేమో అన్నది కూడా వైసీపీలో ఎక్కడో ఉంది అని అంటున్నారు. దాంతో తీర్పు విషయంలో ఉత్కంఠ ఉంది అంటున్నారు.

వంగవీటి బ్రాండ్ తో :

ఇక విజయవాడ మీద అందరి చూపు ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఎదురు చూస్తే మరో తీర్పుగా దీనిని చూడాలి. పుష్కర కాలం తరువాత ప్రత్యక్ష ఎన్నికల్లో వంగవీటి రాధాక్రిష్ణ మేయర్ సీటుకు పోటీగా ఉన్నారు. ఆయన జనసేన నుంచి బరిలో ఉండడం రాజకీయంగా సామాజికపరంగా మరో ఆసక్తిని పెంచే పరిణామం. అలాగే వంగవీటి బ్రాండ్ పొలిటికల్ గా ఎపుడూ గట్టిగానే పనిచేస్తుంది. ఈసారి కూడా అదే మ్యాజిక్ రిపీట్ అవుతుందని కూటమి నమ్మకంగా ఉంది. టీడీపీ జనసేన కలసికట్టుగా బరిలోకి దిగుతోంది కాబట్టి రిజల్ట్ ఇక్కడ రీ సౌండ్ చేస్తుంది అంటున్నారు.

ఏబీవీ ఎంట్రీతో :

ఇక వైసీపీ నుంచి మాజీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి పోటీకి దిగారు. బీసీ ఓటు తో వైసీపీ ఇక్కడ ట్రంప్ కార్డునే వాడుతోంది. బీసీలు వలస వచ్చి నివాసం ఉంటున్న వారు మైనారిటీలు తమ వైపు అని వైసీపీ భావిస్తోంది. ఇక మేయర్ గా అయిదేళ్ళు పనిచేసిన భాగ్యలక్ష్మి అందరికీ తెలిసిన వారుగా ఉంటారు కాబట్టి ప్లస్ అవుతుందని ఊహిస్తోంది. అయితే రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఎంట్రీతోనే అసలు ఇంట్రెస్ట్ మొదలైంది. ఆయన ఒక బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో ఆయన ప్రభావం ఎంత ఉంటుంది, ఏ మేరకు ఉంటుంది అన్నదే చర్చగా ఉంది. అలాగే ఆయన తీసుకునే ఓట్లు ఎవరికి నష్టం చేకూరుస్తాయి అన్నది మరో చర్చ. ఆయన ఎంట్రీతో వైసీపీ నష్టపోతుంది అని ఒక విశ్లేషణ ఉంటే టీడీపీకి కొంత ఇబ్బంది అని మరో చర్చగా ఉంది. ఏది ఏమైనా విజయవాడ అంటే రాజకీయ రాజధాని, ఇక్కడ మేయర్ అంటే నగర ప్రథమ పౌరుడు. అందువల్ల ఈ ఎన్నిక మీద ఏపీ మొత్తం ఆసక్తిగా ఎదురుచూస్తోంది. అలా ఏపీలో విశాఖ విజయవాడ ఎన్నికల ఫలితాలు అయితే హీటెక్కించబోతున్నాయని అంటున్నారు.

పెన్ పవర్

శనివారం 31 అక్టోబర్ 2026

ఆ క్రెడిట్ అతనికే దక్కుతుంది: అభిషేక్ శర్మపై యువరాజ్ సింగ్ ప్రశంసలు

- అభిషేక్ శర్మ కష్టానికి తగిన ఫలితం దక్కిందన్న యువరాజ్
- టీ20 ర్యాంకింగ్స్‌లో మళ్లీ నెం.1 స్థానానికి చేరిన అభిషేక్
- న్యూజిలాండ్‌పై 38 బంతుల్లో 113 పరుగులు చేసిన యంగ్ ఓపెనర్
- టీ20ల్లో అత్యధిక సెంచరీలు చేసిన భారతీయుడిగా కోహ్లీని అధిగమించిన అభిషేక్
- ఆధునిక క్రికెటర్లు రాణించడానికి స్పోర్ట్స్ సైన్స్ కారణమన్న యువీ



టీమిండియా యువ సంచలనం, లెఫ్ట్ హ్యాండ్ ఓపెనర్ అభిషేక్ శర్మ అద్భుత ఫామ్‌పై మాజీ ఆల్‌రౌండర్, అతని మెంటార్ యువరాజ్ సింగ్ ప్రశంసలు కురిపించాడు. అభిషేక్ కఠోర శ్రమ వల్లే అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ స్థాయికి ఎదిగాడని, టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తిరిగి నెం.1 స్థానాన్ని దక్కించుకోవడం వెనుక అతని కృషి అమోఘమని అన్నాడు.ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో అభిషేక్ విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడిన విషయం తెలిసిందే. అక్టోబర్ 27న వెల్లింగ్‌టన్‌లో జరిగిన ఆ మ్యాచ్‌లో కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు చేసి భారత్‌కు 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు. ఈ ఇన్నింగ్స్‌తో భారత్ 3-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది.ఒక కార్యక్రమంలో మాట్లాడిన యువరాజ్, అభిషేక్ విజయం గురించి ప్రస్తావించాడు. “అభిషేక్ శర్మ 30, 34 బంతుల్లో సెంచరీలు చేశాడు. ఇదంతా అతని కఠోర శ్రమకు ఫలితం అని నేను భావిస్తున్నాను. ఈ స్థాయికి రావడానికి అతను చాలా కష్టపడ్డాడు. ఇప్పుడు ప్రపంచ క్రికెట్‌లో మళ్లీ నెం.1 స్థానానికి చేరుకున్నాడు. ఆ క్రెడిట్ అంతా అతనికే దక్కుతుంది” అని ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో మాట్లాడుతూ వివరించాడు.ఈ సెంచరీతో టీ20 ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు (11) చేసినఁ

భారతీయ క్రికెటర్‌గా అభిషేక్ శర్మ నిలిచాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లీ (10) రికార్డును అధిగమించాడు. ప్రపంచవ్యాప్తంగా ఈ జాబితాలో క్రిస్ గేల్ (22), బాబర్ అజామ్ (13) తర్వాత మూడో స్థానంలో ఉన్నాడు.భారత ఆటగాళ్లలో, ముఖ్యంగా వైట్-బాల్ క్రికెట్‌లో వస్తున్న మెరుగుదలను కూడా యువీ ప్రశంసించాడు. మెరుగైన రికవరీ పద్ధతులు, స్పోర్ట్స్ సైన్స్ కారణంగా ఆటగాళ్లు గాయాల నుంచి త్వరగా కోలుకుంటున్నారని, తమ ప్రదర్శనను మెరుగుపరుచుకుంటున్నారని తెలిపారు. మొత్తం మీద, తన మెంటార్ అయిన యువరాజ్ మార్గదర్శకత్వంలో అభిషేక్ శర్మ అద్భుతంగా రాణిస్తూ టీమిండియాలో కీలక ఆటగాడిగా ఎదుగుతున్నాడు.

అమ్మ చెప్పిన నెంబర్.. రోహిత్ శర్మ 'జెర్సీ నెంబర్ 45' వెనుక కథ ఇదే!

- తన జెర్సీ నెంబర్ 45 వెనుక ఉన్న కథను పంచుకున్న రోహిత్ శర్మ
- అండర్-19లో 19వ నెంబర్ జెర్సీతో ఆడినట్లు వెల్లడి
- రాహుల్ ద్రావిడ్ కారణంగా ఆ నెంబర్‌ను వదులుకున్నట్లు తెలిపిన హిట్ మ్యాన్
- అమ్మ సలహాతో 4+5=9 అయ్యేలా 45 నెంబర్‌ను ఎంచుకున్నట్లు వివరణ



టీమిండియా 'హిట్ మ్యాన్' రోహిత్ శర్మ తన ఐకానిక్ జెర్సీ నెంబర్ 45 వెనుక ఉన్న ఆసక్తికరమైన కథను అభిమానులతో పంచుకున్నాడు. తాను హోస్ట్‌గా వ్యవహరిస్తున్న 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' అనే గేమింగ్ రియాలిటీ షోలో ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ జెర్సీ నెంబర్‌ను ఎంచుకోవడం వెనుక తన తల్లి పాత్ర కీలకమని రోహిత్ తెలిపాడు.ఈ షోలో నటుడు రాహుల్ లోహని.. "సర్, 45 నెంబర్ జెర్సీ చూడగానే హిట్ మ్యాన్ వచ్చాడని అందరికీ అర్థమవుతుంది. కానీ మీరు ఈ నెంబర్‌నే ఎందుకు ఎంచుకున్నారు?" అని ప్రశ్నించారు. దీనికి రోహిత్ బదులిస్తూ, తొలినాళ్లలో అండర్-19 ఆడుతున్నప్పుడు తనకు 19వ నెంబర్ జెర్సీ కేటాయించారని చెప్పాడు. ఆ నెంబర్ అంటే ఇష్టంతోనే ఆడానని, కానీ ఆ తర్వాత సీనియర్ జట్టులోకి వస్తే ఆ నెంబర్‌ను కొనసాగించలేవని ఒకరు చెప్పారని గుర్తుచేసుకున్నాడు. అప్పట్లో టీమిండియా కెప్టెన్‌గా ఉన్న రాహుల్ ద్రావిడ్ 19వ నెంబర్ జెర్సీతో ఆడేవారని, అందుకే ఆ నెంబర్‌ను వదులుకోవాల్సి వచ్చిందని వివరించాడు."ఆ నెంబర్‌తో ఆడలేనని తెలియగానే, వెంటనే హోటల్‌కు వెళ్లి మా అమ్మకు ఫోన్ చేశాను. ఏ నెంబర్ తీసుకోవాలో చెప్పమని అడిగాను. అప్పుడు అమ్మ 'న్యూమరాలజీ ప్రకారం 9 వచ్చేలా చూసుకో, నీకు మంచిది' అని సలహా ఇచ్చింది" అని రోహిత్ తెలిపాడు. అయితే 9వ నెంబర్ అప్పటికే వేరొకరు తీసుకున్నారని, 27 (2o7=9) తీసుకోవడం ఇష్టం లేదని చెప్పాడు. "అదే సమయంలో 4, 5 అంకెలు పక్కపక్కన ఉంటే బాగుంటుందనిపించింది. ఈ విషయాన్ని అమ్మకు చెప్పి, 4o5 కలిపితే 9 వస్తుంది కదా అని ఒప్పించాను. అలా '45' నెంబర్‌ను ఎంచుకున్నాను" అంటూ తన జెర్సీ వెనుక ఉన్న కథను రోహిత్ వివరించాడు.కాగా, 'ఫ్యామిలీ ఫుల్ హౌస్ విత్ రోహిత్ శర్మ' కార్యక్రమం సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్‌లో ప్రసారం అవుతుండగా, సోనీ లివ్ యాప్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

260 పరుగుల లక్ష్యం ముందు భారత్ తడబాటు.. న్యూజిలాండ్ ఘన విజయం

భారత్‌పై న్యూజిలాండ్‌కు 87 పరుగుల విజయం

కివీస్ స్కోరు 259/7.. భారత్ 172/9

లక్ష్య ఛేదనలో తడబడ్డ భారత బ్యాటర్లు

ఫిలిప్స్ 49 బంతుల్లో 107 పరుగులు

ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 3-1



న్యూజిలాండ్‌తో జరిగిన నాలుగో టీ20లో భారత జట్టుకు ఘోర పరాజయం ఎదురైంది. గ్లెన్ ఫిలిప్స్ (107; 49 బంతుల్లో 6 ఫోర్లు, 10 సిక్సర్లు), మైకేల్ బ్రేస్‌వెల్ (65; 25 బంతుల్లో 4 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసక ఇన్నింగ్స్‌లతో చెలరేగడంతో తొలుత న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 259 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు తడబడటంతో 20 ఓవర్లలో 9 వికెట్లకు 172 పరుగులకే పరిమితమైంది. దీంతో కివీస్ 87 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ ఆధిక్యం 3-1కి తగ్గింది.

టాస్ గెలిచిన భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకుంది. అయితే న్యూజిలాండ్ బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడుగా ఆడారు. ఫిన్ అలెన్ (31; 17 బంతుల్లో) వేగంగా పరుగులు రాబట్టగా, డారిల్ మిచెల్ 9 బంతుల్లోనే 24 పరుగులు చేశాడు. ఆ తర్వాత ఫిలిప్స్ భారత బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ముఖ్యంగా నితీశ్ కుమార్ రెడ్డి వేసిన 16వ ఓవర్‌లో ఫిలిప్స్ వరుసగా నాలుగు సిక్సర్లు బాదాడు. నోబాల్‌తో కలిపి ఆ ఓవర్‌లో 32 పరుగులు వచ్చాయి. బ్రేస్‌వెల్ కూడా ధాటిగా ఆడటంతో ఐదో వికెట్‌కు వీరిద్దరూ కేవలం 40 బంతుల్లోనే 115 పరుగులు జోడించారు. ఫిలిప్స్ సెంచరీ పూర్తి చేసుకోగా.. బ్రేస్‌వెల్ అర్ధశతకంతో ఆకట్టుకున్నాడు. భారత బౌలర్లలో మయాంక్ యాదవ్ 48 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు.

260 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగిలాయి. సంజూ శాంసన్ రెండు బంతులకే, ఇషాన్ కిషన్ మూడు బంతులకే పెవిలియన్ చేరారు. అభిషేక్ శర్మ (27), శ్రేయస్ అయ్యర్ (22) కొద్దిసేపు పోరాడినా భారీ భాగస్వామ్యం నెలకొల్పలేకపోయారు. నితీశ్ రెడ్డి 10 బంతుల్లో 21 పరుగులు చేసి దూకుడు చూపించాడు. అయితే వరుస విరామాల్లో వికెట్లు పడటంతో భారత్ 89 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో తిలక్ వర్మ (35; 35 బంతుల్లో), నమన్ ధీర్ (28; 13 బంతుల్లో) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు 32 పరుగులు జోడించారు. నమన్ ధీర్ ఔటైన తర్వాత భారత పోరాటం మరింత బలహీనపడింది. తిలక్ వర్మ కూడా 19వ ఓవర్‌లో వెనుదిరగడంతో భారత్ ఓటమి ఖాయమైంది. న్యూజిలాండ్ బౌలర్లలో జాకబ్ డఫీ నాలుగు వికెట్లు తీసి భారత పతనాన్ని శాసించాడు. మ్యాట్ ఫిషర్, మిచెల్ శాంట్నర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. నిజానికి న్యూజిలాండ్ ఫీల్డర్లు పలు క్యాచ్‌లను జార విడిచారు. లేదంటే భారత్ ఇంకాస్త ముందే ఓటమిని చవిచూసేది. అద్భుత సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన ఫిలిప్స్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కింది.

బుల్లి తెర ద్వారా వెండి తెరపై అడుగు పెట్టి సుదీర్ఘ కాలంగా రంగుల ప్రపంచంలో వినోదాన్ని అందిస్తున్న ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం దాటింది. హిందీ సీరియల్స్, హిందీ సినిమాలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తూ వచ్చిన ముద్దుగుమ్మకు లక్కీగా తెలుగు సినిమా 'సీతారామం' సినిమాతో హిట్ పడింది. ఆ సినిమాలో చిన్న పాత్ర కోసం మృణాల్‌ను దర్శకుడు హను రాఘవపూడి కలవడం జరిగిందని, కానీ ఆమెను చూసిన తర్వాత సీతా మహాలక్ష్మి పాత్రకు మృణాల్ అయితేనే బాగుంటుందనే నమ్మకంతో ఆమెను నటింపజేశాడు. ఆయన నమ్మకంను మృణాల్ నిలుపుకుంది, అంతే కాకుండా సీతా మహాలక్ష్మి పాత్ర గురించి ఎప్పటికీ తెలుగు ప్రేక్షకులు చెప్పుకునే విధంగా నటించి, అందంగా కనిపించి మెప్పించింది. అందుకే సీతారామం సినిమా మృణాల్ కెరీర్ లో చాలా స్పెషల్ మూవీ అనడంలో సందేహం లేదు.

టాలీవుడ్‌లో మృణాల్ ఠాకూర్‌కి...

హీరోయిన్‌గా మృణాల్ ఠాకూర్‌కి టాలీవుడ్ నుంచి మంచి ఆఫర్లు వచ్చాయి. కానీ ఈమెకు బాలీవుడ్‌లో స్టార్‌డం దక్కించుకోవడం ఆసక్తి. అందుకే టాలీవుడ్‌లో వరుసగా సినిమాలు చేస్తూ కూడా బాలీవుడ్‌లో ఆఫర్ల కోసం ప్రయత్నాలు చేస్తూనే ఉంటుంది. తెలుగులో డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడికి మంచి హిట్ పడింది. అయితే తెలుగులో మరిన్ని సినిమాలు చేయడానికి మాత్రం ఈ అమ్మడు ఆసక్తి చూపడం లేదు అనేది కంప్లైంట్. బాలీవుడ్‌లో ఈ మధ్య కాలంలో రెండు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాల ఫలితంతో సంబంధం లేకుండా బ్యాక్ టు బ్యాక్ హిందీ సినిమాలు చేస్తూనే ఉంది. సౌత్ లో వస్తున్న ఆఫర్లను ఈమె సున్నితంగా తిరస్కరిస్తుందనే పుకార్లు వినిపిస్తున్నాయి. సౌత్ లో రాకా తర్వాత ఇప్పటి వరకు ఈమె కొత్త సినిమాను కమిట్ కాలేదు.

రాకా సినిమాలో మృణాల్...

అల్లు అర్జున్, అట్లీ కాంబోలో రూపొందుతున్న రాకా సినిమాలో ఈమె నటిస్తుందా అనే విషయంలో కూడా ఇప్పటి వరకు అధికారిక ప్రకటన రాలేదు. కొత్త సినిమాలు ఏమీ చేయక పోయినా ఎప్పటికప్పుడు అందమైన ఫోటోలు, వీడియోలతో మృణాల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ ఉంటుంది. తాజాగా మరోసారి అందాల ఫోటోలతో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఏకంగా 16 మిలియన్‌ల ఫాలోవర్స్ ను కలిగి ఉన్న ఈ అమ్మడు రెగ్యులర్‌గా స్కిన్ షో ఫోటోలు, అప్పుడప్పుడు ఇలాంటి అందమైన ఔట్ ఫిట్ ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. స్కిన్ షో ఫోటోలు షేర్ చేస్తే వైరల్ కావడం పెద్ద వింతేమి కాదు, కానీ ఇలా నిండుగా ఉన్న ఫోటోలను షేర్ చేసిన సమయంలో కూడా వైరల్ అయితే అప్పుడు వారి బ్యూటీకి ఒక విలువ ఉన్నట్టు అని కొందరు కామెంట్స్ చేస్తున్నారు.



రాయల్ ఫ్రేమ్‌లో పాలక్.. గ్లామర్ ఓకే కానీ..

ఇన్‌స్టాగ్రామ్‌లో మృణాల్ ఫోటో షూట్...

స్కిన్ షో చేయకున్నా మృణాల్ ఇలాంటి ఫోటో షూట్స్ తో కూడా చూపు తిప్పనివ్వదని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఒక బ్రాండ్ ప్రమోటింగ్ ఫోటో షూట్ అని తెలుస్తోంది. బెంగళూరు డైరీస్ అంటూ ఈ ఫోటోలకు ఇన్‌స్టాగ్రామ్ లో మృణాల్ కామెంట్ పెట్టడం అందరి దృష్టిని ఆకర్షించింది. ఇక ఈ ఫోటోల్లో మృణాల్ ఠాకూర్ ను చూస్తూ ఉంటే కాస్త బరువు తగ్గినట్టు అనిపిస్తుందని, తన గత చిత్రాలతో పోల్చితే ఈ ఫోటోల్లో సన్నగా, చిక్కిందా అన్నట్లుగా కనిపిస్తుందని నెటిజన్స్ అంటున్నారు. మృణాల్ కెరీర్ ఆరంభంలో కాస్త ఎక్కువ బరువు కలిగి ఉండేది. అయినా కూడా చాలా అందంగా ఉండేది. అయితే కొందరు సన్నబడితే అందం తగ్గుతుందని అంటారు. కానీ మృణాల్ విషయంలో అది నిజం కాదని ఈ ఫోటోలు చూస్తే అర్థం అవుతుంది. చక్కనమ్మ చిక్కినా అందమే అన్నట్లుగా ఈ ఫోటోలకు మృణాల్ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటోలకు తెలుగు అభిమానులు తెలుగులో సినిమా ఎప్పుడు అంటూ కామెంట్స్ చేస్తున్నారు. మరి మృణాల్ సమాధానం ఏంటో మరి...!



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com